# వార్త

ఆదివారం

24 నవంబరు, 2024



# చలి కాలుష్యంలో జనం విలవిల



## తారాతీరం



# ప్రత్యేక పాటలో శ్రీలీల

అల్లు అర్జున్, సుకుమార్ కలయికలో రూపొందుతున్న చిత్రం 'పుష్ప 2' ది రూల్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై, సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం డిసెంబరులో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో వున్న ఈ సినిమా మరో వైపు నిర్మాణానంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. అయితే ఇందులో ఉన్న ఓ ప్రత్యేక గీతంలో నర్తించబోయే కథానాయిక గురించి గత కొన్ని రోజులుగా వివిధ పేర్లు వినిపించాయి. అయితే ఇప్పుడు ఈ చిత్రంలో ప్రత్యేక గీతంలో కథానాయిక శ్రీలీల నర్తించబోతున్నట్లుగా మేకర్స్ అఫీషియల్‌గా తెలియజేశారు. చంద్రబోస్ సాహిత్యం సమకూర్చిన ఈ పాటకు గణేష్ ఆచార్య కొరియోగ్రఫీని అందిస్తున్నట్లు తెలుస్తోంది.

# శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'కుబేర'

దర్శకుడు శేఖర్ కమ్ముల చిత్రాలకు ప్రేక్షకుల్లో ఓ మంచి గుర్తింపు ఉంది. ఆయన చిత్రాలంటే మనసుకు హాయిగా ఉంటాయనేది వాళ్ల హృదయాల్లో నాటుకుపోయింది. తాజాగా శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో రాబోతున్న చిత్రం 'కుబేర'. ధనుష్, నాగార్జున హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న నాయికగా నటిస్తోంది. అమిగోస్ క్రియేషన్స్, ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీ బ్యానర్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'కుబేర' చిత్రం నుంచి నేడు గ్లింప్స్‌ను విడుదల చేశారు.



గ్లింప్స్‌లో ఒక్క సంభాషణ లేకపోయినా ఆ విజువల్స్ చూస్తుంటే అవి మనతో మాట్లాడినట్లుగా, ఎంతో డెప్త్‌గా అనిపిస్తుంది. డబ్బుకు మానవ సంబంధాలకు ఉన్న సంబంధాన్ని, కుటుంబ భావోద్వేగాలను ప్రతి మనసుకు తాకే విధంగా చాలా లోతుగా శేఖర్ కమ్ముల ఈ చిత్రంలో డిస్కస్ చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. తెలుగు, తమిళం, హిందీ భాషలో ఈ చినరతాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్న ఈ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ఆదివారం వార్త
24 నవంబరు, 2024

## మంచి ముత్యాలు

మనసును చలింపచేసే అన్ని అవలక్షణాలను
మనం ఎప్పుడు దూరం చేస్తామో,
అప్పుడు సంతోషాన్ని సొంతం చేసుకోగలం.

**- అనుభవానంద స్వాములు**

## విషయ విశేషం


పరిపూర్ణ ఆరోగ్యం కోసం..... 4

'సంఘీ'భావం....5

వివాదాస్పదంలో భూముల స్వాధీనం

కవర్ స్టోరీ..6

చలి కాలుష్యంలో
జనం విలవిల

వైఫై పాస్‌వర్డ్...11

ఈవారం కవిత్వం..12

చల్లగాలి

ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనియన్ గండికోట..14

కృష్ణమ్మ పరవళ్లు..
సోమశిల అందాలు.....18

కథ.. 20

రాతిగుండె

సాహిత్యం.. 23

వివేకానంద కవితా వైభవం

ఇల్లు పునర్నిర్మించినప్పుడు... 25

ఏకాగ్రత లేకపోతే...26

సమయస్ఫూర్తి...28

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..


## తాజా వార్తలు


### పురుషుల్లో గుండెజబ్బులు



కొన్ని విషయాల్లో ఆడవాళ్ల బేలగా మారి, ఏదైనా ఉంటే పైకి చెప్పుకుని బాధపడతారు. దాంతో ఆ బాధ నుంచి ఉపశమనం కూడా పొందుతారు. మగవాళ్ల అలా కాదు. గుంభనంగా ఉంటారు. ఏ విషయాన్నీ పైకి చెప్పరు. నోరు తెరిచి సాయం అడగలేరు. ఇలా చేస్తే ఎక్కడ తమని చిన్నచూపు చూస్తారోననే భయం. ఇదిగో ఈ అలవాటే మగవాళ్లలో గుండెజబ్బులు పెరగడానికి కారణం. అంటోంది యూనివర్సిటీ ఆఫ్ షికాగో శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనం. చిన్న అనారోగ్యమేగా? ఇది మనల్ని ఏం చేస్తుందులే అనే నిర్లక్ష్యమే కాకుండా, ఇది మనల్ని ఏం చేస్తుందిలే అనే ధీమా వాళ్లని సకాలంలో చికిత్స తీసుకోనివ్వకుండా చేస్తున్నాయట. ఒక వేళ వాళ్లకి సమస్య ఉందని తెలిసినా, దాని గురించి చర్చించడానికి పెద్దగా ఇష్టపడరట. 24 సంవత్సరాల కాలంలో సుమారు 1400 మందిపైన చేసిన పరిశోధనలో ఈ వాస్తవాలు



వెల్లడయ్యాయి. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఎవరేమనుకుంటారో అనే విషయాన్ని పక్కన పెట్టి ఉన్నది ఉన్నట్టుగా చెప్పడం చాలా కీలకం అంటున్నారు అధ్యయనవేత్తలు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

ఆరోగ్యమే మహాభాగ్యం. ఆరోగ్యమే వ్యక్తి ప్రగతికి పునాది. ఆరోగ్యాన్ని ఖరీదు కట్టలేం. ధనాన్ని సంపాదించవచ్చు. ఆ ధనాన్ని వెచ్చించి అనుకున్న వస్తువుల్ని కొనవచ్చు. డబ్బు ఖర్చు చేసి అంతరిక్షాన్ని ముద్దాడవచ్చు. ఆరోగ్యాన్ని మాత్రం డబ్బుతో వెలకట్టలేం.

# పరిపూర్ణ ఆరోగ్యం కోసం..

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

ఒక వ్యక్తి సమాజంలో ఉన్నతంగా నిలబడడానికి సంపూర్ణ ఆరోగ్యం మాత్రమే కనీస అవసర అర్హత అని మనకు తెలుసు. అనారోగ్యంతో ఆసుపత్రి పడక మీద ఉన్నప్పుడు ఆరోగ్య ప్రాధాన్యం అవగతం అవుతుంది. తరుచుగా జబ్బు చేస్తే మనిషి మతి తప్పి నిరాశ పెరిగి శారీరక మానసిక శక్తి నశిస్తుంది. సాధారణంగా ఫ్లూ, జ్వరం, జలుబు, దగ్గు లాంటి అనారోగ్యాలు తరుచుగా అనుభవంలోకి వస్తాయి. జబ్బులతో రోగనిరోధకశక్తి క్షీణిస్తుంది. మన చుట్టు తిరిగే కొద్ది మంది మాత్రం సదా సంతోషంగా తిరుగుతూ, సరదాగా ఉంటూ ఆరోగ్యంగా ఉంటారు. వ్యక్తిగత ఆరోగ్యం వరించడానికి మన జీవనశైలిని కొంత మార్పు చేసుకొని జీవితాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి. వ్యక్తిగత ఆరోగ్యానికి పునాదులుగా ఐదు అలవాట్లను గుర్తించారు.



## శారీరక చురుకుదనం/వ్యాయామం

ఆరోగ్యం వరించాలంటే ప్రతిరోజు శారీరక శ్రమకు కొంతైనా సమయం కేటాయించాలి. వ్యాయామాలు, నడక, జాగింగ్, యోగా, ధ్యానం, ప్రాణాయామం, స్ట్రెచ్చింగ్ ఎక్సర్‌సైజులు, ఏరోబిక్స్, సైక్లింగ్, ట్రెక్కింగ్ లాంటి శారీరక వ్యాయామాలు చేయాలి. శారీరక వ్యాయామాలతో హృదయనాళ, శ్వాస సంబంధ దీర్ఘకాలిక వ్యాధులు దూరం అవుతాయి. శారీరక శ్రమతో రక్త ప్రసరణ క్రమబద్ధీకరించబడి ఆరోగ్యకరంగా మెదడు పని చేస్తుంది. క్రీడాకారులు వాడే హెల్దీ మైండ్ ఇన్ హెల్దీ బాడీ అనే సూత్రాన్ని మరువరాదు.



**ఆహార నియమాలు:** ఒకే రకమైన ఆహార పదార్థాలను వరుసగా 3,4 రోజులు తినరాదు. వారంలో ఏడు రోజులు వీలైనంత వరకు వేరు వేరు (కూరగాయలు, పండ్లు, కాయలు, వంట నూనెలు, బియ్యం, గోధుమలు, చిరుధాన్యాలు, ఇతర ఆహార పదార్థాలు) పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలి. మనం తీసుకునే ఆహార పదార్థాల్లో విటమిన్లు, ఖనిజ లవణాలు సమపాళ్ళలా ఉండే విధంగా మన మెనూను తయారు చేసుకోవాలి.

## మానసిక ఒత్తిడికి దూరంగా..

సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉన్న వారు మానసిక ఒత్తిడిని జయిస్తారు. అనవసర ఒత్తిడి బారిన పడితే అనారోగ్య భూతం దరి చేరుతుంది. మానసిక ఒత్తిడి పెరిగితే హృదయ సంబంధ అనారోగ్యాలు కలుగుతాయి. యోగా, ధ్యానం, ప్రాణాయామాలు లాంటి పలు ఒత్తిడిని జయించే టెక్నిక్‌లను ప్రతి రోజు పాటిస్తూ ఒత్తిడిని దూరం పెట్టాలి.

## ఆంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉన్న పండ్లు

మనం నిత్యం తీసుకునే భోజనంలో వివిధ రకాల పండ్లు ఉండే విధంగా జాగ్రత్త పడాలి. అత్యుత్తమ పోషక విలువలు, ఆంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న సంత్రాలు, ఆపిల్స్, బెర్రీస్, దానిమ్మ, ద్రాక్ష లాంటి సీజనల్ ఫ్రూట్స్ తప్పక మన భోజనంలో తీసుకోవాలి. ఆంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న పండ్లు తినడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి తగ్గిపోయి, వ్యాధినిరోధకశక్తి పెరగడంతో వ్యాధికారక సూక్ష్మజీవులను నాశనం చేయడం జరుగుతుంది.



**నిద్ర:** ఆరోగ్యవంతులకు ప్రతి రోజ 7,8 గంటల నిద్ర వసరమవుతుందని నిర్ణయించారు. నిద్ర లేమి సమస్య అనుభవించే వారికి హృదయం, మెదడు, నేత్ర సంబంధ ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుంది. ప్రతి రాత్రి కనీసం 6 గంటలు నిద్ర పోవడం తప్పనిసరి అని గమనించాలి. ఈ ఐదు సూత్రాలను పాటించడంతో పాటు మన జీవనశైలిలో ఒక క్రమ పద్ధతిలో పాటించాలి. భోజనం చేసే సమయాలను పాటించాలి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి వేళ 7 గంటల లోపు తేలికైన స్వల్ప పరిమాణంలో ఆహారం తీసుకోవాలి. సదాలోచనలు చేయడం, పలువురు మంచి మిత్రుల నడుమ సరదాగా గడపడం, ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శించడం, విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం లాంటివి తమ సంపూర్ణ ఆరోగ్య సిద్ధికి ఉపకరిస్తాయని గుర్తుంచుకోవాలి. సంతోషం సగం బలం, దుఃఖమయ జీవితం కళావిహీనం.

## 'సంఘీ' భావం



# వివాదాస్పదంలో భూముల స్వాధీనం

ప్రభుత్వం ప్రజా అవసరాల దృష్ట్యా ప్రజల భూములను స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. అభివృద్ధి విషయంలో భూముల స్వాధీనానికి చట్టాలు, న్యాయస్థానాలు కూడా అనుకూలంగానే ఉంటాయి. అయితే వీటికి కొన్ని షరతులు ఉన్నాయి. ఇటీవలే సుప్రీంకోర్టు ఈ అంశంపై కీలకమైన సూచనలు కూడా చేసింది. రహదారుల విస్తరణ, వంతెనల నిర్మాణం, ప్రాజెక్టుల అభివృద్ధి, నిర్మాణం సమయంలో పెద్దఎత్తున భూముల అవసరం ఏర్పడుతుంది. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూములు కాకుండా ప్రజలు, రైతుల నుంచి కూడా భూములను స్వాధీనం చేసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులుగాని, ప్రజలు కాని నష్టపోకుండా వారికి నష్టపరిహారాన్ని అందిస్తారు. నిబంధనల ప్రకారం మార్కెట్ రేటు కంటే ఎక్కువ మొత్తంలోనే చెల్లింపులు ఉంటాయి. భూముల సేకరణ, చెల్లింపుల విషయంలో ప్రతి అంశం పారదర్శకంగా ఉంటుంది. ముందుగానే ఎవరి భూమిని స్వాధీనం చేసుకుంటున్నారన్న అంశాలను బహిరంగంగా ప్రకటించడంతో పాటు వాటిని పత్రికల్లో కూడా ప్రకటనల రూపంలో ముద్రిస్తారు. అదేవిధంగా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కూడా ప్రైవేటు వ్యక్తులు, రైతుల భూములను స్వాధీనం చేసుకుంటారు. పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు వంటివి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో సెక్రటేరియట్ ఏర్పాటు చేయడానికి సుమారు 30 వేల ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో పాటు భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని, కౌలు మొత్తాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తమకు జీవనోపాధి కల్పించే భూములను ఇవ్వడం బాధాకరమే అయినా రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రైతులు ముందుకు వచ్చి ఉదారంగా తమ భూములను అందించారు. ఈ విషయంలో వివాదాలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం, అధికారులు రైతులతో సమన్వయంతో వ్యవహరించారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్ట్, సోమశిల, నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి అనేక ప్రాజెక్టుల నిర్మాణం సమయంలో కొన్ని గ్రామాలే నీటమునిగే పరిస్థితి ఏర్పడింది. ప్రాజెక్ట్ నిర్మించే సమయంలో నీటికి అడ్డుకట్ట వేయడంతో వెనుక ఉన్న వందలాది ఎకరాలు నీటమునుగుతాయి. దీనిని కాంటూరు లెవల్‌గా గుర్తించి నోటిఫికేషన్ ఇచ్చి ఆయా భూములను. గ్రామాల్లో ఇళ్లను స్వాధీనం చేసుకుంటారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారికి ప్రత్యామ్నాయ స్థలాలను, ఇళ్లను కూడా కేటాయిస్తారు. ఇదంతా పరస్పర అంగీకారంతో జరుగుతుంది. అయితే కొన్ని సందర్భాల్లో పరిశ్రమల ఏర్పాటుసమయంలో కొన్ని సమస్యలు ఏర్పడతాయి. ప్రభుత్వం ఈ అంశంలో బలవంతంగా భూములు స్వాధీనం చేసుకునే అవకాశం ఉండదు. అందుకు ముందుగా గ్రామ సభలు నిర్వహించి సదరు పరిశ్రమ రావడం వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు నష్టపరిహారంగా ఇచ్చే మొత్తాన్ని కూడా వివరిస్తారు. పలుమార్లు సభలు నిర్వహించడం, చర్చలు జరపడం ద్వారా సానుకూల వైఖరిలో భూములను స్వాధీనం చేసుకుంటారు. పరిశ్రమలను ఏర్పాటుచేయడం ద్వారా ఉత్పత్తులు పెంచడం, స్థానిక ప్రాంతాలు అభివృద్ధి జరగడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అనేక ప్రయోజనాలు ఉంటాయి. దీనితో ముందుగా రైతులు, ప్రజలు తమ భూములు ఇవ్వడానికి నిరాకరించినా విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సర్దుబాటు ధోరణితో ముందుకు వస్తారు. అయితే ఈ సమయంలో అనేక సమస్యలు ఏర్పడతాయి. ప్రజలతో చర్చించడానికి జిల్లా కలెక్టర్‌తో పాటు సీనియర్ అధికారులు ముందుకు వస్తారు. ఇది వారి విధుల నిర్వహణలో ఒక భాగం. రైతులతో చర్చించి వారి నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుని ప్రభుత్వానికి అప్పగించడం వరకు మాత్రమే వారికి విధి. ఇది ఒక రాష్ట్రంలో కాకుండా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రక్రియ. గ్రామ సభలను బహిష్కరించడం. నిరసన తెలపడం, రోడ్డెక్కి రాస్తారోకోలు వంటి ఘటనలు సర్వసాధారణంగా జరుగుతాయి. అన్ని అంశాలపై అవగాహన జిల్లా కలెక్టర్లకు ఉంటుంది కాబట్టి వారు సమర్థవంతంగా ఇలాంటి ఘటనలను ఎదుర్కొని సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తారు. పరిశ్రమ స్థాపించడం వల్ల కలెక్టర్లకు వ్యక్తిగతంగా ఒనగూడే ప్రయోజనాలు ఏమీ ఉండవు. కేవలం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గ్రామసభల ముందు ఉంచి అభిప్రాయాలు సేకరిస్తారు. గ్రామస్తులు ఇచ్చిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తారు. భూముల సేకరణ ప్రక్రియ అంతసులభవంతమైన పనికాదు. ప్రజలు కూడా జిల్లా కలెక్టర్లకు, సీనియర్ అధికారులకు గౌరవం ఇచ్చి తమ ఇబ్బందులు చెప్పుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఒకవేళ కలెక్టర్ తమ బాధ్యతలను బేఖాతరు చేస్తున్నట్లు గుర్తిస్తే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంది. అందుకు భిన్నంగా అధికారులపై దాడులు చేయడం అన్నది సరైన విధానం కాదు. అయితే ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు జోక్యం చేసుకోవడంతో పరిస్థితులు చేజారుతుంటాయి. ఏదైనా పరిశ్రమస్థాపనకుగాని, అభివృద్ధి కార్యక్రమాలకు గాని భూములను అందించాల్సి వస్తే గ్రామంలో పెద్దలతో సమావేశం ఏర్పాటుచేసి చర్చించుకుని ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. భూములు ఇస్తారా లేదా అన్న ది పక్కన పెట్టి అధికారులపై దాడులుచేయడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా తయారు అవుతుంది. చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులు కావడం ద్వారా జైలుకు వెళ్లడం, జరిమానాలు విధించాల్సి రావడం వంటి సమస్యలు ఎదురౌతాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# చలి కాలుష్యంలో జనం విలవిల

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు

**మానవ** మనుగడకు అవసరమైన ఆహారం తినకుండా కొన్ని రోజులు బతకొచ్చు, అలాగే నీటిని తాగకుండా కూడా కొన్ని గంటలు జీవించవచ్చు. నిజానికి తిండికన్నా, నీటికన్నా గాలే అత్యంత ప్రధానం. దీనిని వినియోగించడంలో ఏ మాత్రం విరామం ఉండదు. విరామం వచ్చింది అంటే మన ఉనికి లేనట్లే.. నిరంతరం ప్రాణవాయువును ఊపిరిగా తీసుకోవాలి, ఊపిరి తీసుకోకుండా ఒక్క ఘడియ కూడా ఉండలేం. మనిషి బ్రతకాలి అంటే ప్రాణ వాయువు(ఆక్సిజన్) కావాలి అనుక్షణం ఈ ప్రాణ వాయువు మన శరీరంలోని అణువణువుకూ అందాలి. మన ఒంట్లో ప్రతి కణానికీ ఆక్సిజన్ అత్యవసరం. ఇది ఏమాత్రం కొరవడినా కణాలన్నీ పని చేయడం మానేస్తాయి. ఇంతటి కీలకమైన ఆక్సిజన్ మనం శ్వాస ద్వారా పీల్చుకునే గాలి నుంచే లభిస్తుంది. ఇది ముందుగా ఊపిరితిత్తుల్లోకి.. అక్కడ్నుంచి రక్తంలోకి చేరుకొని.. హిమోగ్లోబిన్‌తో జతకట్టి అన్నికణాలకు కొత్త ఊపిరిని పోస్తుంది. అప్పుడే మనం జీవించి ఉండగలుగుతాం. ఇటువంటి ప్రాణవాయువు నేడు కాలుష్య కారకాలతో నిండిపోయి విషతుల్యమై ఊపిరి తీసుకోవడమే ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించింది.

మనచుట్టూ ఉన్న పరిసరాల్లో స్థాయికి మించిన హానికర పదార్థాలు చేరడాన్ని కాలుష్యం అంటారు. ఒక ప్రదేశంలో హానికర పదార్థాలు, ఉండకూడని పాళ్లలో,ఉండకూడని సమయంలో ఉంటే ఆ కారకాలను కాలుష్య పదార్థాలంటారు. అధిక మోతాదులో ఘన, ద్రవ, వాయు పదార్థాలు గాల్లో కలిసి గాలిని హానికరంగా మార్చడాన్ని గాలి కాలుష్యం లేదా వాయు కాలుష్యం అంటారు. మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతి ప్రసాదించిన వనరులను అవసరానికి మించి వాడుకుంటున్నాడు... ఆ వనరుల దుర్వినియోగంతో మితిమీరుతున్న కాలుష్యం మనుషుల ఆయువును హరించివేస్తున్నది. వాతావరణంలో కర్బన ఉద్గారాలు విపరీతంగా పెరిగిపోవడం వలన స్వచ్ఛమైన ప్రాణవాయువు శాతం తగ్గిపోతోంది. రోజు రోజుకు ప్రాణవాయువు కలుషితమైపోతుంది. విషవాయువుగా మారిన ప్రాణ వాయువును మనకు తెలియకుండానే పీలుస్తున్నాం. ఫలితంగా ప్రాణాలను నిలబెట్టాల్సిన వాయువే విషమై మన ఆయువును హరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కుటుంబాలను అది శోకసంద్రంలో ముంచుతోంది.

డిసెంబర్ 2 జాతీయ కాలుష్య నివారణా దినోత్సవం సందర్భంగా ప్రాణ వాయువు విష్యతుల్యం కావడానికి కారణాలేమిటి దాని ప్రభావాలు, వాటి గురించి ఈ రోజు కవర్ స్టోరీ కథనం.

గాలి నాణ్యతను ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ)తో కొలుస్తారు. వాతావరణంలో ఒక క్యూబిక్ మీటర్ గాలిలో కెమికల్స్ రియాక్షన్స్‌తో ఏర్పడిన, లేదా దుమ్ము, ధూళి కణాలు, నిర్మాణ ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో వెలువడే కాలుష్యాల (పర్టిక్యులేట్ మేటర్)ను లెక్కించి కొలుస్తారు. గంటకోసారి లేదా 8 గంటలకోసారి కొలవడం ద్వారా సగటు ఏక్యూఐని గుర్తిస్తారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమాల ప్రకారం ఒక రోజు అనగా 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 15 మైక్రోగ్రాముల లోపు ఉంటే అది ప్రమాదం వుండదు, అంతకంటే పెరిగితే మాత్రం ముప్పు తప్పదు. అయితే, మన దేశంలో వాయు ప్రమాణాలు మాత్రం వేరుగా ఉన్నాయి. వాటి ప్రకారం 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 60 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం అంతగా ఉండదు. కానీ మనదేశంలో ప్రస్తుతం 75 మైక్రోగ్రాముల కంటే అధికంగానే ఉంటున్నట్లు తెలుస్తుంది. క్యూబిక్ మీటర్ గాలిలో పి.ఎం 2.5 కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాల రేటు సగటున 3 శాతం దాకా పెరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.గాలిలో 40 రకాల కాలుష్య ఉద్గారాలు కలవడం ద్వారా వాయువు కలుషితం అవుతుంది. వాహనాలు, రోడ్లు, చెత్తను కాల్చడం, నిర్మాణ పనులు వంటి కారణంగా వాయువు కలుషితం అవుతున్నది. వీటిలో అతి సూక్ష్మకణాలు అంటే (పీఎం 2.5), సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి ఉద్గారాలు ఉంటాయి. కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయించిన ప్రకారం ఉద్గారాలు గాలిలో 60 మైక్రోగ్రాములకు మించరాదు. అయితే పట్టణాల్లో 100 మైక్రో గ్రాములకు మించి నమోదవుతున్నది.

ప్రధానంగా ఎండాకాలం ఈ కాలుష్యం మరింత ఎక్కువగా పెరుగుతున్నది. పొడి వాతావరణం, ఎండ వేడి కారణంగా గాలిలో ఇవి తొందరగా కలిసి వాయుకాలుష్యం పెరుగుతున్నదని పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, కాలుష్య నియంత్రణ మండలి) పరిశీలనలో తేలింది. వీటిని అన్నింటినీ పరిగణలోనికి తీసుకుని ప్రస్తుతం ఈ పుడమిపై 99 శాతం మంది పీల్చేగాలి.. సురక్షిత ప్రమాణాలకు అనుగుణంగా లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. దీనినిబట్టి వాయుకాలుష్య జాడ్యం ఏ స్థాయిలో ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే పలు పరిశోధనల్లో వాయు కాలుష్యం విషయమై అనేక కఠోర వాస్తవాలు బయటప డ్డాయి. ఈ గాలి కాలుష్య ప్రభావం ఏ ఒక్క దేశానికో, ప్రాంతానికో పరిమితం కాదు. కొన్ని దేశాల్లో ఎక్కువ మరి కొన్ని దేశాల్లో తక్కువగా ఉన్నప్పటికీ ఈ కాలుష్యం మొత్తం ప్రపంచమంతా వ్యాప్తి చెంది ఉంది. పారిశ్రామిక విప్లవం తర్వాత మాత్రం ఇది వాయువేగంతో విస్తరిస్తూ వచ్చింది. పారిశ్రామికీకరణ అనేది నగరాలకు పట్టణాలకు మాత్రమే పరిమితమై ఉంటుంది కనుక గ్రామాలలో దీని ప్రభావం ఉండదని భావిస్తూ వచ్చారు. అయితే ఈ వాయు కాలుష్యం గ్రామీణ ప్రాంతాలనూ వదలటం లేదు.



పట్టణాల్లో ఫ్యాక్టరీలు, కర్మాగారాలు, వాహనాల వంటివి కాలుష్యానికి దారితీస్తుంటే.. పంట వ్యర్థాలు కాల్చటం, వంట చెరకు, కిరోసిన్ పొయ్యిల వంటివి గ్రామాల్లో స్వచ్ఛమైన గాలి కాస్తా కలుషితమై పోయింది. వాయు కాలుష్యం పెరగడానికి దోహదపడుతున్న అంశాలను విడివిడిగా పరిశీలిస్తే..

## శిలాజ ఇంధనాల దహనం

పారిశ్రామికీకరణ విస్తృతం అవుతున్న నేపథ్యంలో బొగ్గు, పెట్రోల్ డీజిల్ తదితర శిలాజ ఇంధనాల వినియోగం వాయు కాలుష్యానికి ప్రధాన కారణం. పారిశ్రామిక వ్యర్థాలు, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు, అపరిమిత విద్యుత్ వినియోగం, నిలువయ్యే మురుగు, చెత్త తగులబెట్టడం వంటివి కూడా గాలిని బాగా కలుషితం చేస్తాయి. శిలాజ ఇంధనాల దహనం వలన దాని ఫలితంగా పెద్ద మొత్తంలో సల్ఫర్ డయాక్సైడ్‌ను వాతావరణం లోనికి విడుదల కావడం మొదలయ్యింది. శిలాజ ఇంధనాల అసంపూర్ణ దహనం ద్వారా విడుదలయ్యే కార్బన్ మోనాక్సైడ్ కూడా వాయు కాలుష్యానికి దారితీస్తుంది.

**పట్టణీకరణ**

రోజురోజుకు పట్టణీకరణ పెరిగిపోవడంతో వాయు కాలుష్యం పెరుగుతోంది. ద్విచక్ర, బహుచక్ర, వ్యక్తిగత వాహనాలు అవసరానికి మించి వాడటంతో వాయు కాలుష్యం విపరీతమైంది.

**ఆటోమొబైల్స్**

జీపులు, ట్రక్కులు, కార్లు, బస్సులు మొదలైన వాహనాల నుంచి వెలువడే వాయువులు పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఇవి గ్రీన్‌హౌస్ వాయువుల యొక్క ప్రధాన వనరులు, వ్యక్తులలో వ్యాధులకు కూడా కారణమవుతాయి.

**వ్యవసాయ కార్యకలాపాలు**

వ్యవసాయ కార్యకలాపాల సమయంలో విడుదలయ్యే అత్యంత ప్రమాదకరమైన వాయువులలో అమ్మోనియా ఒకటి. పురుగు మందులు, పురుగుమందులు, ఎరువులు వినియోగం వలన వాతావరణంలో హానికరమైన రసాయనాలను విడుదలై గాలి కలుషితం కావడం మొదలయ్యింది. కర్మాగారాలు, పరిశ్రమలు కార్బన్ మోనాక్సైడ్, సేంద్రియ సమ్మేళనాలు, హైడ్రోకార్బన్లు మరియు రసాయనాల యొక్క ప్రధాన మూలం. ఇవి గాలిలోకి విడుదలై దాని నాణ్యతను దిగజార్చాయి.

**గనుల త్రవ్వకం**

మైనింగ్ ప్రక్రియలో, భూమి క్రింద ఉన్న ఖనిజాలను పెద్ద పెద్ద పరికరాలను ఉపయోగించి వెలికితీస్తారు. ఈ ప్రక్రియలో వెలువడే దుమ్ము, రసాయనాలు గాలిని కలుషితం చేస్తున్నాయి.

**చెత్త దహనం:** ప్లాస్టిక్కును, పాత టైర్లను, పారిశ్రామిక వ్యర్థాలను, ఇతర చెత్తా చెదారాన్ని జనావాసాల మధ్యే కాల్చడం వల్ల కూడా వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. పట్టణాలకు సమీపంలోని గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం, వాటిలో పశువుల కళేబరాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వస్తువులు, చెత్తాచెదారాన్ని వేసి కాలుస్తున్నారు. దీంతో అందులో నుంచి వెలువడుతున్న పొగ ప్రజలను ఊపిరాడకుండా చేస్తోంది. దీంతో ప్రజలు నిత్యం వాయుకాలుష్యంతో శ్వాసకోశవ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారు.

**పాతవాహనాల సమస్య..:** 15 ఏండ్లు దాటిన కాలం చెల్లిన వాహనాలు వెలువరించే కాలుష్యంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నిబంధనల ప్రకారం 15 ఏండ్లు గడువు దాటిన వాహనాలను రీ సైక్లింగ్ చేయాలి. అయితే కాలం చెల్లిన వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంతో పెద్ద మొత్తంలో వాయు కాలుష్యం కమ్మేస్తోంది. గాలి కాలుష్యాన్ని తగ్గించడంలో అడవులు కీలక పాత్ర వహిస్తాయి. అయితే అటువంటి అడవులు దహనమైతే వాటి పొగ కణాలు కాలుష్యాలు చాలా ఎక్కువగా విడుదల అవుతాయి. దాని ఫలితంగా విషపూరిత వాయువులు పీలుస్తూ మన ఉనికికే ప్రమాదం ఏర్పడుతూ ఉంది.

**బాణాసంచా కాల్పులు:** గతంలో సంవత్సరంలో ఒకసారి దీపావళి లాంటి పండగలకు టపాసులు కాల్చేవారు. కానీ నేడు పండగలకు, పబ్బాలకు, పెండ్లిళ్లకు,చావులకు, పేరంటాలకు, ఎన్నికల విజయాలకు, ప్రమాణ స్వీకారాలకు, ప్రారంభోత్స వాలకు మొదలయిన అన్ని సందర్భాల్లో కాలుస్తున్న బాణసంచా కాల్పులు వలన సంభవించే కాలుష్యం నిత్యకృత్యమైపోయింది. విలాసాలకు, సౌఖ్యాలకు అలవాటు పడ్డ నగరజీవి జీవనశైలికి తోడు అవసరానికి మించిన ఏసీల వాడకం, సొంత వాహనాల్ని విరివిగా వాడటం వల్ల కూడా సమస్య జటిలమోతోంది.

ప్రపంచ వ్యాప్తంగా సంపన్నులు వినియోగిస్తున్న ప్రైవేటు జెట్ లతో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని...స్వీడన్ లోని లిన్నెయస్ యూనివర్సిటీ అధ్యయనం తెలిపింది. గత ఐదేళ్లలో ప్రైవేట్ జెట్‌ల నుంచి వెలువడ్డ ఉద్గారాలు...46 శాతం పెరిగాయని పేర్కొంది. ఇవి ఒక సగటు మనిషి ఏడాదంతా విమానాల్లో ప్రయాణించిన దాని కంటే, 500 వందల రెట్లు ఎక్కువని వివరించింది.. ఏదేమైన 70 శాతం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు విమానాలు బాధ్యత వహిస్తున్నాయి. దీని కారణంగా కాలుష్య సమస్య మరింత పెరుగుతోంది.



**దేశీయ వనరులు:** గృహ శుభ్రపరిచే ఉత్పత్తులు, పెయింట్లలో గాలిలో విడుదలయ్యే విష రసాయనాలు ఉంటాయి. కొత్తగా పెయింట్ చేయబడిన గోడల నుండి వచ్చే వాసన పెయింట్లలో ఉండే రసాయనాల వాసన. ఇది గాలిని కలుషితం చేయడమే కాకుండా శ్వాసను కూడా ప్రభావితం చేస్తుంది.

**కేన్సర్లు:** గాలి కాలుష్యం వంటి పర్యావరణ అంశాలూ గణనీయంగా దోహదం చేస్తున్నాయి. గాలి కాలుష్యంతో.. ముఖ్యంగా సూక్ష్మనుసి (పీఎం2.5) ప్రభావానికీ ఊపిరితిత్తుల క్యాన్సర్లు, రొమ్ము క్యాన్సర్ల ముప్పు పెరగటానికీ సంబంధం ఉంటున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. దీంతో క్యాన్సర్ మరణాలూ ఎక్కువవుతున్నాయి. ఆరుబయట వాయు కాలుష్యం మూలంగా కొందరిలో మూత్రాశయ, ప్రోస్టేట్, రక్త కేన్సర్ల ముప్పూ పెరుగుతోంది.

## గర్భంపై ప్రభావం

కలుషిత రేణువులు గర్భస్థ పిండంలోని మాయ, కాలేయం, ఊపిరితిత్తులతోపాటు మెదడులోకి ప్రవేశిస్తున్నట్లు స్కాట్లాండ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. గర్భిణిగా ఉన్నప్పుడు నైట్రోజన్ డైఆక్సైడ్ను ఎక్కువగా పీల్చిన మహిళలకు పుట్టే సంతానానికి వ్యవహారశైలి సంబంధ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కలుషిత గాలికి గర్భిణులు ఎక్కువగా గురైతే.. వారికి నెలలు నిండకుండానే కాన్పు రావడంతో పాటు తక్కువ బరువుతో శిశువులు జన్మించడానికీ ఆస్కారం ఉంటుందని వైద్యులు నిర్ధారించారు.

## సంతాన లేమి

కలుషిత గాలిలోని రసాయనాలు రక్తం ద్వారా పునరుత్పత్తి వ్యవస్థలోకీ చొచ్చుకెళ్లే అవకాశం ఉన్నాయని, ఇవి శుక్రకణాలను దెబ్బ తీస్తాయని ఫలితంగా సంతాన లేమి కలుగుతుందని డెన్మార్కు చెందిన పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

## ఆయు క్షీణం

దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యంతో మానిషి ఆయుష్షు సగటున 3.5 ఏళ్లు తగ్గుతున్నదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో ఇది మరింత పెరగొచ్చని ఇటీవల చికాగో విశ్వవిద్యాలయం వాయు నాణ్యత 'జీవన సూచిక ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ 2024' నివేదిక పేర్కొంది. వాయు కాలుష్యం వల్ల మన దేశ జనాభాలో సగానికంటే ఎక్కువ మంది ఆయుర్దాయం సగటున మూడేసి సంవత్సరాలు తగ్గిపోతోందనే అధ్యయనం ఆందోళన కలిగిస్తుంది.

## చిన్నారుల పాలిట శాపం

వాయు కాలుష్యం చిన్నారుల పాలిట శాపంగా మారుతోంది. పెద్దలతో పోలిస్తే పిల్లలు వేగంగా శ్వాసిస్తారు. అందువల్ల వారి ఊపిరితిత్తుల్లోకి అధిక మోతాదు కాలుష్య కారకాలు ప్రవేశిస్తాయి. పిల్లలు తక్కువ ఎత్తులో ఉండటం వలన నేలకు దగ్గరగా ఉంటారు. పెద్దలతో పోలిస్తే.. వాతావరణంలో చాలా దిగువ ప్రాంతం నుంచి వారు గాలిని పీల్చుకుంటారు. అక్కడ కొన్నిరకాల కాలుష్యకారకాల తీవ్రత ఎక్కువ అవి పిల్లలకు ప్రమాద కరంగా మారుతున్నాయి.వాయు కాలుష్యం కారణంగా దేశంలో ప్రతి రోజూ 464 మంది ఐదేళ్ల లోపు చిన్నారులు వాయు కాలుష్య కాటుకు బలవుతూ వారి భవిత ఛిద్రం అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 15 ఏళ్లలోపు చిన్నారుల్లో 93 శాతం మంది (180 కోట్ల మంది).. ఆరోగ్యం, ఎదుగుదలను ప్రమాదంలో పడేసే స్థాయిలో కలుషితమైన గాలిని శ్వాసిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) పేర్కొంది. కలుషిత గాలితో కలిగే దిగువ శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 7 లక్షల మంది పిల్లలు మరణిస్తున్నట్లు అంచనా వేసింది.

చదువుపై ప్రభావం ముఖ్యంగా గాలిలో నుసి (పీఎం2.5) లోని అమ్మోనియం నైట్రేట్ మూలంగా 9 10 ఏళ్ల పిల్లల్లో నేర్చుకునే సామర్థం, జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా అధ్యయనంలో బయటపడింది.



అమ్మోనియం నైట్రేట్ నేర్చుకునే సామర్థ్యాన్ని, జ్ఞాపకశక్తిని క్షీణింప జేస్తున్నట్టు గుర్తించారు. ఇది వారి విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.

యాంటీబయోటిక్స్ పని చేయవు.

వాయు కాలుష్యం విజృంభన వలన గుండెల నిండా హాయిగా గాలి పీల్చుకోవాలంటే భయం. మాస్కు లేకుండా ఇల్లు కదలాలంటే ఏర్పడిన భయం. శరీరాన్ని, మెదడుని ఆక్రమిస్తుంది. దీని కారణంగా సంజీవిని లాంటి యాంటీబయోటిక్స్ కూడా శరీరంపై పని చేయలేని ప్రమాదం పెరగనుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

## ఆత్మహత్యలు

ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించే కాలుష్యం రక్తప్రవాహంలోకి, ఆపై మెదడుకు ఆక్సిజన్ సరఫరాను నిరోధించడం ద్వారా బలవన్మ రణాలను ప్రేరేపిస్తుందని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి. చెడు గాలి మనుషుల ఆలోచనలను ప్రభావితం చేయడంతో పాటు, అది మెదడును పొగమంచులా చుట్టేసి వారికి తెలియకుండానే ఆత్మహత్య ఆలోచనలను ప్రోత్సహించే అవకాశం ఉంది. యేల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు వాయు కాలుష్యానికి, ఆత్మహత్యలకు మధ్య ఉన్న సంబంధంపై నిర్వహించిన 18 అధ్యయనాలను సమీక్షించారు. ఈ అధ్యయనాల ప్రకారం విశ్లేషిస్తే.. వాయు కాలుష్యం మూడు రోజుల పాటు ఎక్కువగా ఉంటే ఆత్మహత్యలకు ప్రేరేపించే ఆలోచనలు పెరుగుతోంది.

దీర్ఘకాలిక వాయుకాలుష్యం కుంగుబాటును పెంచే ప్రమాదం కూడా ఉంది. కాగా, దీనిపై యూరప్, ఆసియాలో అనేక అధ్యయనాలు జరిగాయి. ఇటీవల అమెరికా డేటాను విశ్లేషించినప్పుడు నగరాల్లో ఒక క్యూబిక్ మీటర్కు ఒక మైక్రో గ్రాము చొప్పున గాలిలో కాలుష్యకారకాలు పెరిగినప్పుడు రోజువారీ ఆత్మహత్యల రేటు 0.5 శాతం పెరిగినట్లు 'కేంబ్రిడ్జ్ నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్' తన అధ్యయన పత్రంలో ప్రచురించింది.



## భారత్‌పై వాయు కాలుష్య ప్రభావం

ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి అంటూ గర్వంగా చెప్పుకుంటున్న మనకు ప్రపంచంలోకెల్లా అత్యంత కలుషిత దేశాల్లో భారతదేశం ఒకటని తాజాగా తేలింది. కర్మ భూమి, వేద భూమి, పుణ్యభూమి అని చెప్పుకునే మన దేశం ఇప్పుడు కాలుష్య భూమిగా ఘనత కెక్కింది. ప్రపంచ వాయు నాణ్యత నివేదిక అతి ప్రమాదకర సూక్ష్మ ధూళికణాలు అధికంగా నమోదైన వంద నగరాల్లో 63 భారత్ కు చెందినవేనని ప్రపంచ వాయు నాణ్యత నివేదిక నిరుడే హెచ్చరించింది. నానాటికీ కట్టలు తెంచుకుంటున్న వాయుకాలుష్యం భారతదేశ అభివృద్ధి లక్ష్యాలకు అడ్డంకిగా మారింది. గత రెండు దశాబ్దాలుగా ఇండియాలో వాయునాణ్యత గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఇది ప్రజల ఆరోగ్యాలను గుల్ల చేస్తోంది. దేశంలో దాదాపు 130 కోట్ల జనాభా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నిర్దేశిత ప్రమాణాల కన్నా అధికంగా సూక్ష్మ ధూళికణాలు (పీఎం2.5) నిండిన ప్రాంతాల్లో జీవిస్తోంది. వాయుకాలుష్యం వల్ల అనారోగ్యం, కార్మికుల ఉత్పాదకత తగ్గడం, వ్యవసాయ దిగుబడులు పడిపోవడం వంటివి భారతదేశ ఆర్థిక రంగంపై ఏటా దాదాపు రూ.12 లక్షల కోట్ల భారం మోపుతున్నా యని అంచనా. భారత్‌లో 50శాతం వాయుకాలుష్యానికి పరిశ్రమలే కారణం. వాహనాల వల్ల 27శాతం, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల 17శాతం, కట్టెలతో వంట చేయడం వల్ల ఏడు శాతం వాయు కాలుష్యం సంభవిస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని నగరాల్లో మనం పీల్చే వాయువులో పీఎం 2.5, పీఎం 10గా పిలిచే సూక్ష్మ ధూళి కణాలు అధిక మోతాదులో ఉంటున్నాయి. ఇవి చాలా ప్రమాదకరం. గాలి పీల్చినప్పుడు ఇవి నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరి శ్వాసకోస వ్యాధులకు కారణమవుతున్నాయి. ఇటీవల నగరాల్లో ఊపిరితిత్తుల కేన్సర్లు పెరగడానికి ఇది ప్రధాన కారణం. చాపకింద నీరులా వ్యాపిస్తున్న వాయుకా లుష్యం ప్రజల ఆరోగ్యాల్ని గుల్లబారుస్తోంది. ఈ కారణంగా రోజూ మనదేశంలో ఎంతోమంది ప్రాణాలను కోల్పోతున్నారు. భారత్‌లోని బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, ముంబై, పూణే, అహ్మదాబాద్, సిమ్లా, వారణాసి నగరాల్లో రోజూ నమోదవుతున్న మరణాల్లో దాదాపు 7 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణం. ఈమేరకు వివరాలతో ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ సంచలన అధ్యయన నివేదికను ప్రచురించింది. ఆయా నగరాల్లోని గాలిలో పర్టిక్యులేట్ మ్యాటర్ (పీఎం) 2.5 మోతాదులో ప్రమాదకర కాలుష్య కారకాలు ఉన్నాయని స్టడీలో గుర్తించారు వాయు కాలుష్యం కారణంగా ఏటా ముంబైలో 5,100 మంది, కోల్‌కతాలో 4,700 మంది, చెన్నైలో 2,900 మంది, అహ్మదాబాద్‌లో 2,500 మంది, బెంగళూరులో 2,100 మంది, హైదరాబాద్‌లో 1,600 మంది చనిపోతున్నారని తెలిపింది ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న ప్రతి నాలుగు వాయు కాలుష్య మరణాల్లో ఒకటి భారత్‌లోనే సంభవిస్తున్నట్లు గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. టొబాకో, డయాబెటీస్ కంటే ఎక్కువగా మరణాలకు ఈ వాయు కాలుష్యం కారణం అవుతోంది.



## కాలుష్య రాజధాని

దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారుతుంది. విశ్వ ప్రమాణాల ప్రకారం ఢిల్లీ మహానగరమే అత్యంత కాలుష్య నగరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. తాజాగా నవంబర్ 14 వ తేదీన మానవ శరీరానికి 050 మధ్య ఉండాల్సిన గాలి నాణ్యత సూచిక(AQI) రాజధానిలో మాత్రం ఏకంగా 500 స్థాయికి దగ్గరై ప్రమాదకర స్థాయిని కూడ మించిపోతోంది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ వాయు కాలుష్యం ఉన్న రాజధాని నగరంగా నిలిచింది. ప్రపంచ వాయు నాణ్యతా సూచీ2021 ప్రకారం ప్రపంచంలో అత్యంత కాలుష్యం నిండిన అయిదు దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. ఢిల్లీ వరసగా నాలుగోసారి ప్రపంచం లోనే అత్యంత కాలుష్యభరితమైన రాజధాని నగరాల జాబితాలో కాలుష్యభరితమైన రాజధాని నగరాల జాబితాలో తొలిస్థానం సాధించింది. ఇటీవలి ప్రపంచ వాయు నివేదిక ప్రకారం ప్రపంచంలో అతి సూక్ష్మ ధూళికణాలుగా పేర్కొనే పీఎం 2.5 తీవ్రస్థాయిలో పేరుకుపోయిన ఇరవై నగరాల్లో భారత్ నుంచి న్యూఢిల్లీ, కోల్‌కత్తా, ముంబైలు నిలిచాయి. ఢిల్లీ కాలుష్యానికి ప్రధాన కారణం వాహనాల నుంచి వెలువడే పొగ అని చెబుతు న్నారు. ఇది ఢిల్లీలో ఇది దాదాపు 13.3గా ఉంది. మరోవైపు పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా వంటి చోట్ల రైతులు రబీ పంటకు తమ పొలాలను సిద్ధం చేసేందుకు శీతాకాలంలో పెద్దయెత్తున వరి వ్యర్థాలను తగల బెట్టడం వలన ఏర్పడిన దట్టమైన పొగ దిల్లీ నగరాన్ని ముంచెత్తి రాజధాని ప్రజలు ఏటా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రైతులు వరి వ్యర్థాలను కాల్చకుండా ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నా, అవి సక్రమంగా అమలు కావడంలేదు. వాయు కాలుష్యం కారణంగా ఢిల్లీలో సగటున 9.7 సంవత్స రాలు, ఉత్తరప్రదేశ్లో 9.5 ఏళ్ల మేర ఆయుర్దాయం క్షీణిస్తున్నట్లు గతంలో పలు అధ్యయనాలు ఆందోళనకర విషయాలను వెల్లడిం చాయి. కలుషిత గాలిని పీలుస్తుండటం వల్ల హస్తినవాసుల జీవితకాలం సగటున 11.9 ఏళ్లు తరిగిపోతున్నట్లు షికాగోలోని 'ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్' లెక్కగట్టింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉత్తర భారతదేశంలో 51 కోట్ల మంది సగటున ఎనిమిదిన్నరేళ్ల

ఆయుష్షును కోల్పోవాల్సి వస్తుందన్నది పరిశోధనల సారాంశం. మన దేశంలో ఏటా 33వేల మంది వాయు కాలుష్యం కారణంగా ప్రాణాలు కోల్పోతుండగా.. వారిలో 12వేల మంది ఢిల్లీవాసులే ఉంటున్నారని లాన్సెట్ నివేదిక పేర్కొంది. కాలుష్యపూరిత రాజధాని ఢిల్లీ మహానగరం నరకానికి నకలుగా మారిందని ఆమధ్య సర్వోన్నత న్యాయస్థానం ఈసడించడం మనకు తెలిసిందే.

### ఢిల్లీలో ఉంటే సిగరెట్లు తాగినట్లే

రాజధాని ఢిల్లీ నగరంలో PM 2.5 సూచి 300 వద్ద ఉంటే ఆ నగరంలో నివసించే ప్రతివ్యక్తి 15 సిగరెట్లు తాగిన దానికి సమానమైన పొగను పీల్చినట్లు లెక్క. ఇందులో పసి పిల్లలు కూడా ఉంటారు. అలాంటి పరిస్థితుల్లో 20-30 ఏళ్లపాటు దిల్లీ నగరంలో నివసించిన ప్రతి ఒక్కరు ధూమపానం చేసినట్లే. వారి శరీరంలోని కణాలు కేన్సర్ బారిన పడటానికి సిద్ధంగా ఉంటాయి. దేశవ్యాప్తంగా ఊపిరితిత్తుల కేన్సర్ బారినపడే వారిలో 50 శాతానికిపైగా బాధితులు పొగతాగని వారేనని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ మహిళల సంఖ్య ఎక్కువగా ఉంది.

**ఆక్సిజన్ బార్లు:** ఢిల్లీలో గాలి కాలుష్యం ఎంత స్థాయికి చేరిం దంటే ఊపిరి పీల్చుకోవడానికి కృత్రిమ గాలిని కొనుక్కునేంత. ఊపిరాడనివ్వని పరిస్థితులను తట్టుకోవడానికి గాలిని కొనుక్కోవలసిన పరిస్థితి ఢిల్లీ వాసులకు తప్పలేదు. హస్తినలో 'ఆక్సిజన్ ప్యూర్' పేరుతో స్వచ్ఛమైన గాలిని (ఆక్సిజన్) అమ్మే బార్ ఓపెన్ అయింది. ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోతున్న తరుణంలో ఇలాంటి దుకాణాలు రాబోయే కాలంలో దేశం అంతటా వచ్చినా పెద్దగా ఆశ్చర్యాన్ని కలిగించే అంశం కాదనే చెప్పాలి.



### నివారణ చర్యలు

డబ్ల్యూహెచ్ ఓ నిర్దేశించిన వాయు నాణ్యత ప్రమాణాలను అందుకోవడానికి ప్రభుత్వాలు ప్రయత్నించాలి. శిలాజ ఇంధనాల వాటాను తగ్గించాలి. ఇంధన సమర్థతను పెంచడంపై పెట్టుబడులు పెట్టాలి. పునర్వినియోగ వనరులకు ప్రాధాన్యం ఇవ్వాలి. వ్యర్థాల నిర్వహణ మెరుగుపడాలి. దీనివల్ల వాటిని కాల్చడం కూడా తగ్గుతుంది. రద్దీగా ఉండే రోడ్లు, కర్మాగారాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు వంటివి వాయు కాలుష్యానికి ప్రధాన వనరులు. పాఠశాలలు, క్రీడా మైదానాలను వీటికి దూరంగా ఏర్పాటు చేయాలి. వీటితో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ప్రభుత్వాలు సైతం అడవుల విస్తీర్ణం పెంచడానికి కృషి చేయాలి. వాయు కాలుష్యం వలన ఉత్పన్న మయ్యే ఆరోగ్య సమస్యలను ప్రతి ఒక్కరికీ వివరించాలి. పాఠశాల స్థాయిలోనే వాయు కాలుష్యాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి.ప్రస్తుతం కళాశాల విద్యలో పర్యావరణ విద్యకు సంబందించిన అంశాలు పెట్టినప్పటికీ వాటి బోధనను మాత్రం తూతూ మంత్రంగా గడిపేస్తున్నారు. నగరాల్లో వీలైనంత ఎక్కువగా ప్రజారవాణా వ్యవస్థలను ఉపయోగించేలా పౌరులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు వాటి కొనుగోలుపై రాయితీలు అందించాలి. ఛార్జింగ్ స్టేషన్లను పెంచడమూ తప్పనిసరి. పరిశ్రమలు నిర్దేశిత ప్రమాణాలను పాటిం చేలా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలి. నిబంధనలను అతిక్రమిం చిన వారిపై ఉక్కుపాదం మోపాలి. ప్రజారవాణా వ్యవస్థను గణనీయంగా మెరుగుపరచాలి.

దేశీయంగా వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడానికి 1981లో ప్రత్యేక చట్టం తెచ్చారు. వాహనాలు, పరిశ్రమలు, పంట వ్యర్థాల నిర్వహణ తదితరాలపై ఇందులో పలు నిబంధనలు పొందుపర చారు. అయినా పరిస్థితి చేయిదాటి పోతుండటంతో కేంద్రం 2019లో జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్సీఏపీ) ప్రారంభించింది. బీఎస్ వాహనాలను అందుబాటులోకి తీసుకొ చ్చారు. పర్యావరణహిత విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.9,934 కోట్లను ప్రత్యేకించారు. అయితే 2023 చివరి నాటికి అందులో సగమైనా వినియోగించలేదు! చివరికి స్వచ్ఛ వాయు కార్యక్రమ గడువును 2026 వరకు పొడిగించి, కాలుష్య కారకాలను 40శాతం మేర తగ్గించాలని సంకల్పించారు. దశాబ్దాలక్రితమే దేశంలో కాలుష్య నియంత్రణ వ్యవస్థ ఏర్పాటైనా ఒరిగిందేముందని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక లోగడే ఈసడించింది. న్యాయ స్థానాలు సైతం చాలాసార్లు సర్కారులకు చీవాట్లు పెట్టాయి. అయినా కూడా కేంద్ర రాష్ట్ర స్థాయుల్లో చట్టబద్ధంగా కాలుష్య నియంత్రణ మండళ్లు (పీసీబీలు) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వాలు, వ్యవస్థలు, ప్రజలు చిత్త శుద్ధితో కృషి చేయకపోతే భవిష్యత్తు అంధకారమే అవుతుంది. ఈ వాయు కాలుష్య తీవ్రతను కట్టడి చేసే విషయంలో కొన్ని దేశాలు మాత్రం వ్యూహాత్మకంగా నివారణా మార్గాలను అనుసరిస్తున్నాయి.

### చైనా నియంత్రణ

మన పొరుగున చైనా కలుషిత పరిశ్రమల కట్టడిలో విశేషంగా రాణిస్తోంది. పీఎం 2.5 ధూళికణాల నియంత్రణలో కలివిడిగా, వేర్వేరుగా ఐరోపా దేశాల కృషి ఎవరికైనా విలువైన గుణపాఠంగానే చెప్పు కోవాలి. ఎందుకంటే తినే తిండి విషయంలో మనలో శ్రద్ధ పెరిగింది. తాగే నీటి విషయంలో మరింత జాగ్రత్త పడుతున్నాం. కానీ, పీల్చే గాలి విషయంలో మనకింకా ఆ స్పృహ రాలేదు. దీనివల్లనే వాయు కాలుష్యం ఇంతగా విజృంభిస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజా భాగస్వామ్యంతో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వాయు కాలుష్య నివారణా కార్యక్రమాను అమలుపర చాలి. ఈ విషయంలో ప్రభుత్వాలు అభివృద్ధి పేరిట ప్రకృతిని పర్యావరణాన్ని పణంగా పెట్టి కార్పొరేట్ రంగానికి ఎర్ర తివాచీ పరుస్తూ పర్యావరణానికి తూట్లు పొడిచే చర్యలను విడనాడాలి. ఆనాడే వాయునాణ్యత మెరుగై దేశంలో జనజీవనం కుదుటపడు తుంది! పౌరులు స్వచ్ఛమైన గాలి, నీరు పొందడం రాజ్యాంగపు అధికరణం 21 హామీ ఇస్తున్న జీవించే హక్కులో భాగమే అని డూన్ వ్యాలీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షించడానికి కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం చిత్తశుద్ధితో పని చేయడం ఒక్కటే ఏకైక పరిష్కార మార్గంగా ఉంది. దీనిని పాటించని నాడు ఈ విషవాయువులకు మనం బలి కావడమే కాదు ఏ పాపం ఎరుగని తరువాత తరాలు వారు, మూగ జీవాలు కూడా దీనికి బలికావలసి వస్తుంది.

# వైఫై పాస్‌వర్డ్




**ఇంటికి** అతిథులు వచ్చారు. వైఫై పాస్‌వర్డ్ ఏంటని అడిగారు. అదేంటో చప్పున గుర్తుకు రాదు. ఆ మాటకొస్తే పూర్తిగా మరిచిపోయారు. ఇలాంటి పరిస్థితి చాలామంది ఎదుర్కొంటూనే ఉంటారు. మరి వైఫై పాస్‌వర్డ్‌ను తెలుసుకోవటమెలా? కనెక్ట్ అయి ఉన్న పరికరాలతో త్వరగా, సులభంగా తెలుసుకోవచ్చు.

**ఆండ్రాయిడ్ ఫోన్లో...**

గూగుల్ పిక్సెల్ ఫోన్ వాడేవారు సెటింగ్స్ ద్వారా నెట్‌వర్క్‌కి, అక్కడి నుంచి ఇంటర్నెట్ విభాగంలోకి వెళ్లాలి. అప్పటికే కనెక్ట్ అయి ఉన్న వైఫై నెట్‌వర్క్ పేరు పక్కనుండే గేర్ గుర్తు మీద క్లిక్ చేయాలి. అప్పుడు మరో పేజీ ఓపెన్ అవుతుంది. అందులో షేర్ మీద క్లిక్ చేసి ఐడీని కన్ఫర్మ్ చేసుకోవాలి. లాగిన్ వివరాలను షేర్ చేయటానికి క్యూఆర్ కోడ్ కనిపిస్తుంది. ఇందులో వైఫై పాస్‌వర్డ్ కూడా ఉంటుంది. సామ్‌సాంగ్స్ గెలాక్సీ యూజర్లయితే సెటింగ్స్ ద్వారా కనెక్షన్స్‌లోకి వెళ్తే వైఫై ఆప్షన్ కనిపిస్తుంది. కనెక్టెడ్ వైఫై నెట్‌వర్క్ పక్కన గేర్ గుర్తు మీద క్లిక్ చేయాలి. తర్వాత చుక్కలతో కూడిన పాస్‌వర్డ్ బాక్స్ పక్కన కన్ను గుర్తు మీద తాకి, ఐడీని ధ్రువీకరించుకోవాలి. అప్పుడు టెక్స్ట్ రూపంలో పాస్‌వర్డ్ కనిపిస్తుంది.

అన్నిరకాల ఆండ్రాయిడ్ ఫోన్లలో వైఫై కన్ఫిగరేషన్ పేజీలు దాదాపు ఇలాగే ఉంటాయి. అయితే వైఫై పాస్‌వర్డ్ మార్చినట్టయితే ఈ చిట్కాలు పనిచేయవని తెలుసుకోవాలి. మార్చినవారి కనెక్టెడ్ వైఫై నెట్‌వర్క్ పక్కన గేర్ గుర్తు మీద క్లిక్ చేయాలి. తర్వాత చుక్కలతో కూడిన పాస్‌వర్డ్ బాక్స్ పక్కన కన్ను గుర్తు మీద తాకి, ఐడీని ధ్రువీకరించుకోవాలి. అప్పుడు టెక్స్ట్ రూపంలో పాస్‌వర్డ్ కనిపిస్తుంది. అన్నిరకాల ఆండ్రాయిడ్ ఫోన్లలో వైఫై కన్ఫిగరేషన్ పేజీలు దాదాపు ఇలాగే ఉంటాయి. అయితే వైఫై పాస్‌వర్డ్ మార్చినట్టయితే ఈ చిట్కాలు పనిచేయవని తెలుసుకోవాలి. మార్చినవారి నుంచి కొత్త పాస్‌వర్డ్‌ను తెలుసుకోవటం తప్ప మరో మార్గం లేదు.

**విండోస్లో..**ల్యాప్‌టాప్ లేదా పీసీలో సెటింగ్స్ జి స్టార్ట్




మెనూ జి నెట్వర్క్ ఇంటర్నెట్ జి వైఫై లోకి వెళ్లాలి. అన్నింటికన్నా పైన కనెక్ట్ అయిన నెట్వర్క్ కనిపిస్తుంది. పేరు మీద క్లిక్ చేస్తే వైఫై నెట్వర్క్ ప్రాపర్టీస్ తెలుస్తాయి. కొత్తగా ఓపెన్ అయిన




పేజీలో వ్యూ వైఫై సెక్యూరిటీని గుర్తించి వ్యూ మీద క్లిక్ చేయాలి. కొత్త డైలాగ్ బాక్స్‌లో వైఫై పాస్‌వర్డ్ ఉంటుంది.

సిస్టమ్ సెటింగ్స్ ద్వారా వైఫైలోకి వెళ్లి కిందికి స్క్రోల్ చేసి నోన్ నెట్‌వర్క్ మీద క్లిక్ చేయాలి. రెండో జాబితా పక్కనుండే మూడు చుక్కలను తాకి పాస్‌వర్డ్ కాపీ చేయాలి. నోట్స్ లేదా పేజెస్ యాప్లోకి వెళ్లి పేస్ట్ చేయాలి. దీంతో పాస్టవర్డ్ పాడారూపంలో కనిపిస్తుంది.

**ఐఫోన్లలో..**

ఐఫోన్లలో ఈ ప్రక్రియ కాస్త తేలికే. మెయిన్, సెటింగ్స్ యాప్లోకి వెళ్లి వైఫై మీద క్లిక్ చేయాలి. నెట్‌వర్క్ పక్క నుండే నీలం వృత్తాన్ని తాకాలి. పాస్‌వర్డ్ మీద క్లిక్ చేస్తే ఐఫోన్ పాస్కోడ్ లేదా ఫేస్ ఐడీతో ధ్రువీకరించుకోవాలని అడుగుతుంది. వీటిని పూర్తి చేయగానే పాస్‌వర్డ్ ప్రత్యక్షమవుతుంది. ●

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# చల్లగాలి!



చల్లగాలి పంచినా
చిల్లిగవ్వ అడగదు
తరువుదీ
తల్లి మనసే.

...

పల్లెపిల్ల నవ్వింది
పసిడి చిన్నబోయింది
హరితం ముందు
అన్ని స్వల్పమే.

...

పల్లెలో ఉండేవి
మట్టిరోడ్లే.
పాదరక్షలు లేకున్నా
సాగుతుంది ప్రయాణం.

...

నీటితడినిచ్చా
చెట్టు నీడిచ్చింది.
మాట పంచినా మనిషి
మంచినివ్వడే.

...

భావాలను వెలగక్కడం
తేలిగ్గాదు.
కవి పుంగవుడే
అందులో నేర్పరి.

కవితో
ఆవాసమే
అతన్ని కవిగా మార్చింది
కవిత్వం
ఓ అల్కెమి.

...

చంటిపిల్లల
చిట్టిపెదాలే!

స్వచ్ఛమైన నవ్వుకు
అచ్చమైన చిరునామా.

...

నింగి వదిలిన
కాగితం పడవ చంద్రుడు
రేయంతా
నదిలోనే తేలాడు.

...

బంగారు గొలుసు
రత్నాలేనా?
అసలు ఆభరణాలు.
ఆత్మీయానురాగాలు.

...

నిద్రలో
పాపాయి నవ్వింది
నింగిని ఒదిలేసాయి
తారలు.

...

గగన కుసుమాలు
నక్షత్రాలు
పరిమళించవు
ప్రకాశిస్తాయి.

– ఏ.నాగాంజనేయులు

# ప్రేమ

తుషార బిందువులతో నిండిన ప్రేమ
హోరుగాలులతో వీస్తున్న ప్రేమ
పిల్లతెమ్మరలతో ప్రియురాలి ప్రేమగీతం
మత్తు ఎక్కించే మనోహరుని ప్రేమ భావం
హృదయంలో తడబడుతున్న ప్రేమ రాగం
చలిగాలిలో వెచ్చదనం కోసం ప్రేమ నెగళ్లు
వణుకుతూ ఉన్న చేతులతో
నీ రెండు చెంపలను
నిమురుతున్న
నీ స్పర్శతో లేచి
వచ్చిన ప్రాణం
హృదయాస్పందన
ఒకటై
ప్రేమ రాగంతో
మమేకమైనాం
ప్రేమకోసం జీవిస్తున్నాం
మరణాన్ని వ్యతిరేకిస్తున్నాం
ప్రేమను గెలిచి ప్రేమ మందిరంలో
ఒకరికొకరు తోడునీడై వీక్షిస్తాం
ప్రేమను గెలిపిస్తాం
ప్రేమ పక్షులపై పోరాడుతాం
ప్రేమకు మరణం లేదంటాం
ప్రేమైక జీవితం అలవర్చుకుంటాం
ప్రేమకు కొత్త నిర్వచనం ఇస్తాం.



– కనుమ ఎల్లారెడ్డి

ఈవారం కవిత్వం


# ఆమని

శిశిరంలో చలిపులి గజదొంగగారు
నిత్యం తనువంతా తీవ్రంగా తడిమేస్తూ
సిరిసంపదలేం దోచుకోబోయారో
దౌర్జన్యాల దాష్టికాలేంజేయబోయారో!

ఆడంబరంగా అగుపించే ఆస్తుల్ని
సర్వం గోల్పోయామని రాల్చుకొని జూపిస్తూ
ఒడుబోడులమని అరకానికి గొరగామని
తుషాలబ్బట్టలు పొగమంచు దుప్పట్లప్పుదెచ్చుకుని.

వాసంతేనేం తెలియని ధైర్యమో తరులకి
భద్రంగా బోషాణంలో దాచిన నగానట్రలు
రంగు రంగుల సొగసైన చీనాంబరాలు
ఒక్కొక్కటిగా తీసిపట్టుకొచ్చి పెట్టుకున్నట్టు!


కొమ్మకొమ్మకీ చిక్కటి చిగుర్ల పట్టువస్త్రాలు
జూకాల్లా తరుశాఖలకి వేలాడ్తూ లేకాయలు
వివాహానికి నవవధువు
ముస్తాబవుతూ
వజ్రవైఢూర్యాలు కెంపు
పచ్చల్దరించినట్టు.



అద్భుత హొయల విరుల
మేయ సౌందర్య సిరులు
మధుమాసపు రేడు సూరీడ్ని
జూసుకొనేమో
రవిదొర చలిదొంగని బంధీ జేశాడేమోనంటూ
వాసంత సొబగులు వేనోళ్ల పొగుడుతూ కోయిలలు!

– రవికిశోర్ పెంట్రాల, లాంగ్లీ, లండన్

# చలనచిత్రవికాసం-డా॥దేశిరాజు



50ఏళ్ల తెలుగు చిత్రపరిశ్రమ గురించి, పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్న డా॥దేశిరాజు లక్ష్మీనరసింహారావు 'తెలుగు చలనచిత్ర వికాసం 1940-1990' పేరిట, థీసిస్‌ను గ్రంథరూపాన ప్రచురింపచేయడం అభినందనీయం. అయిదు దశాబ్దాల చలనచిత్ర చరిత్రను 9అధ్యాయాలుగా సంబంధిత నేపథ్యసమాచారం, పరిశ్రమాభివృద్ధి, సంగ్రహం, ముగింపుగా సమగ్ర చరిత్ర అందించారు. రచయితకు తెలుగు చలనచిత్ర పరిశ్రమతో ఎంతో సాన్నిహిత్యం ఉన్న కారణంగా ఈ సిద్ధాంత గ్రంథం లక్ష్యాన్ని సాధించింది. సినిమాటోనగ్రఫీ చట్టాలు నివేదికలు, సావనీర్లు, ముఖాముఖిలు, పరిశోధనా వ్యాసాలు, పుస్తకాలు, డైరెక్టరీలు, పత్రికలు, ప్రకటనలు, గ్రామఫోన్ రికార్డులు, సమీక్షలు క్షుణ్ణంగా విషయాల అధ్యయనం, పరిశోధనల అవిశ్రాంత కృషి సఫలీకృతమై ఈ ఉద్గ్రంథం రూపుదిద్దుకొంది. 15 అనుబంధాలలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలు సేకరించి పొందుపరిచారు. తెలుగు చిత్రరంగ ప్రముఖులు బాహాటంగా రాజకీయరంగ ప్రవేశాలు, వాటి పరిణామాలు విశ్లేషించారు. మూకీ చిత్రాలకాలం నుంచి, తెలుగు చలన చిత్రనిర్మాతలు, కళాకారులు, సినీరంగ వివిధ ప్రక్రియల ప్రముఖుల వారి జయాపజయాలు, ఒడిదుడుకులు అవార్డుల విజయపరంపరలు, చిత్రాల జాబితాలతో సహితం సమగ్రంగా అర్ధశతాబ్దికాలంలో తెలుగు చలనచిత్ర వికాస చరిత్ర డా॥దేశిరాజు ఛాయాచిత్రాలతో సమగ్రంగా శాస్త్రీయ విద్యాపరిజ్ఞానంతో అందించారు. నేడు తెలుగు చలన చిత్రపరిశ్రమ అంతర్జాతీయ కీర్తిశిఖరాన్ని అధిష్ఠించి ఆస్కార్ అవార్డ్‌ల విజేతగా విశ్వవేదికపై విరాజిల్లే ప్రతిష్ఠ సాధించిన దిశాప్రస్థానాన్ని డా॥దేశిరాజు ఈ గ్రంథంలో సుస్పష్టం చేసారు.

**(తెలుగు చలనచిత్ర వికాసం, రచన: డా॥దేశిరాజు లక్ష్మీనరసింహారావు, వెల: రూ 300, ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి.1-2-7, బానూకాలనీ, గగన్‌మహల్‌రోడ్, దోమలగూడ, హైదరాబాద్)**

– యర్రమిల్లి

**పుస్తక సమీక్ష**

# వివిధ సాహితీమూర్తులతో 'విహారి' అక్షర సాన్నిహిత్యం




ప్రముఖ కథకుడు, నవలా రచయిత 'విహారి' తన ఆరు దశాబ్దాల సాహిత్య ప్రస్థానంలో అనేక సాహితీమూర్తులతో అక్షరసాన్నిహిత్యం నెరపారు. వారితో గల తన పరిచయాలను, పంచుకున్న అనుభూతులను 39 వ్యాసాలతో అక్షరబద్ధం గావించి వెలువరించిన గ్రంథం 'పరిపరి పరిచయాలు'. తనకు గల పరిచయాలను రేఖామాత్రంగా స్పృశించి..ఆయావిశిష్ట వ్యక్తుల జీవిత, సాహిత్య విశేషాలను ప్రస్ఫుటంగా వెలికి తీసుకొచ్చే ప్రయత్నంగావించడం విశేషం. ఆరుద్ర గురించి రాస్తు 'త్వమేవాహకు నిజాం నిరంకుశ పరిపాలనపై ధిక్కారస్వరానికినగారా'గా అభివర్ణిస్తారు విహారి. రాధాకృష్ణతత్వం అర్థం పరమార్థం కథనాత్మకంగా వచ్చిన 'వసి' వాడని లత నవల 'మోహనవంశీ' అంటూ రచయిత్రి తెన్నేటి హేమలతను గుర్తుకు తెచ్చుకుంటారు. తెలుగు కథకు అంతర్జాతీయఖ్యాతి నార్జించిపెట్టిన పాలగుమ్మి, విశ్వనాథం వారిని ఆనందతాండవం చేయించిన 'శివతాండవం' రచయిత పుట్టపర్తి, అమ్మకథల స్పెషలిస్టు కె.వి.కృష్ణ, తెలంగాణ సాయుధపోరాటానికి, ఆంధ్రరాష్ట్ర ఉద్యమానికి మద్దతు పలికిన సోమసుందర్, వచన కవితా పితామహుడు కుందుర్తి, పి.వి.నరసింహారావు ముందుమాటలు రాసిన 'వందేమాతరం' గ్రంథ రచయిత గొల్లపూడి, 'శ్రీశ్రీకవితా ప్రస్థానం'పై మొట్టమొదటి విమర్శనాగ్రంథం రాసిన అద్దేపల్లి..యిలా విశిష్ట వ్యక్తులతో విహారి పరిచయాలు చదవడం ఓ చక్కటి అనుభవం.

**(పరిపరి పరిచయాలు, రచన: విహారి, వెల: రూ 200, ప్రతులకు: జె.103, (తెల్ల బ్లాక్), రాజపుష్ప, ఆర్టిఐ, గోల్డెన్ మైల్ రోడ్, కోకాపేట్, హైదరాబాద్)**

– రమణ వెలమకన్ని

# వెంకటరమణ 'కళాప్రపంచం'



రచయిత తన తల్లిదండ్రులైన స్వర్గీయ లంక సత్యనారాయణ, సార్వతమ్మలకు ఈ పుస్తకాన్ని అంకితం చేసారు. లలితకళా వాచకం అంటూ వాడ్రేవు చినవీరభద్రుడు, ఇది విశ్వకళా ప్రపంచం అంటూ ఈమని శివనాగిరెడ్డి, కళాసాగర్ యల్లపు, లాంటి పెద్దలు ఈ పుస్తకానికి విలువైన ముందుమాటలు రాసారు. ఈ పుస్తకంలో 53 విలువైన వ్యాసాలున్నాయి. కళాతాత్విక ప్రపంచం, సాంస్కృతిక పునరుజ్జీవన కళాప్రపంచం, సాహితీప్రపంచం, పురస్కార ప్రపంచం, సినీసంగీత నృత్య ప్రపంచం అనే ఐదు విభాగాలుగా ఈ వ్యాసపరంపర వుంది. తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ గ్రహీతలైన విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డి రావూరికి భరద్వాజల గురించి రాసిన వ్యాసాలు బాగున్నాయి. నిశ్శబ్ద సంగీత తుఫాన్-బిథోలిన్ (పేజీ.175) కె.బాలచందర్, దేవానంద్, యామినీ కృష్ణమూర్తి (పేజీ 184), మైఖేల్‌జాక్సన్ (పేజీ.187) వ్యాసాలు ఎన్నో కొత్త విషయాలు పాఠకులకు 'కళా' ప్రియులకు రచయిత అందించారు. ఆస్కార్ విజేత రెహమాన్ (పేజీ.191) కొంకణ తీరంలో కళాయాత్ర (పేజీ.193) వ్యాసాలు చాలా బాగున్నాయి. వ్యంగ్య చిత్రకళాపితామహుడు శంకర్‌పై రాసిన వ్యాసం (పేజీ.21) ఆలోచింపచేస్తుంది. మానవుడు ఎప్పుడైతే స్థిరనివాసం ఏర్పం చుకున్నాడో నాటి నుండే కళావికాసం మొదలైంది. రియలిస్ట్ చిత్రకారులైన హామ్లెట్, జొన్సిటో, ఎకిన్, రాబర్ట్ హెన్రీ, గ్లాకిన్స్, బెంజిమన్ లూస్ జాన్లోన్ మొద లైన వారి గురించి ఈ పుస్తకంలో తెలుసు కొంటారు. పి.వి.శర్మ గురించి తెలియ చేయడం బాగుంది. వారిపై చాలామందికి తెలియదు (పేజీ.100). జె.బి.షా అయాన్ రాండ్, రాఫెల్ గురించి రాసిన వ్యాసాలు, ఫొటోలు ఆకట్టుకొంటాయి. విలువైన పుస్తకం ప్రతి ఇంటా వుండాల్సిన గొప్ప పుస్తకం. **(కళాప్రపంచం, రచన: ఎల్.ఆర్. వెంకటరమణ, వెల: రూ 250, ప్రతులకు: 2-198, సెకండ్‌రోడ్, న్యూటౌన్, అనంతపురం)**

– తంగిరాల చక్రవర్తి

# ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనియన్ గండికోట

షేక్ అబ్దుల్ హకీం జాని



## గండికోట అనేది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు తాలూకాలో పెన్నానది ఒడ్డున ఉన్న ఒక ప్రాచీన దుర్గం. జమ్మలమడుగు నుండి 6 మైళ్ళ దూరంలో గండికోట నెలకొని ఉంది. ఎర్రమల పర్వత శ్రేణికి, పర్వత పాదంలో ప్రవహించే పెన్నానది కొండల మధ్య గండి ఏర్పడింది. ఆ సమీపాన కోటను నిర్మించడం వల్ల ఈ కోటకు 'గండికోట' అనే పేరు వచ్చింది. దీనినే 'గండి కొండ' అని కూడా పిలుస్తారు. ఇక్కడి ఎర్రమల పర్వత శ్రేణినే గండికోట కొండలు అని కూడా అంటారు. ఈ కోటను పూర్వం గిరిదుర్గం అని కూడా పిలిచేవారు. పెన్నా నదికి ఇరువైపులా ఎత్తైన ఎర్రని కొండలు ఉంటాయి. 'సూర్యరశ్మి' ఈ కొండలపై పడినప్పుడు పరమాద్భుతంగా కనిపిస్తాయి. ఇక్కడ ఇరువైపులా రిజర్వాయర్లు ఉన్నాయి. ఆ కారణంగా నిత్యం నీటితో కళకళలాడుతూ ఈ ప్రదేశం కనువిందు చేస్తుంది. వేలాది బండరాళ్ళు ఇక్కడ కనిపిస్తాయి. పెన్నానదీ లోయ వేలాది సంవత్సరాల క్రితం ఏర్పడిందని ఇక్కడి చరిత్ర చెబుతోంది. చుట్టూ లోతైన లోయలు, ఎర్రటి గ్రానైట్ శిలలతో ఏర్పడిన దుర్భేధ్యమైన కొండలు. 300 అడుగుల దిగువలో ప్రవహించే పెన్నానది ఇత్యాదివి ఇక్కడి కోటకు సహజసిద్ధమైన రక్షణ కవచాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే అమెరికా పడమర ప్రాంతపు దక్షిణ భాగంలో అరిజోనా రాష్ట్రంలోని మహాద్భుత ప్రకృతికి నిలయమైన గ్రాండ్ కెనియన్ నేషనల్ పార్క్ గుర్తుకు వస్తుంది. అందుకే దీన్ని ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనియన్ అని పిలుస్తారు. నిశ్చితార్థమైనవారు పెళ్ళి సమయంలో ప్రదర్శించడానికి వెడ్డింగ్ షూట్లు ఇక్కడ చిత్రీకరిస్తుంటారు. కొండలెక్కుతూ సాహసాలు చేయడం, చిన్న పడవలలో ప్రయాణించడం ఇత్యాది సాహస క్రీడలు ఇక్కడ ఉల్లాసాన్ని కలిగిస్తాయి. గండికోట 16వ శతాబ్దం వరకు హిందూ రాజుల పాలనలో ఉంది ఆ తరువాత ముస్లింరాజుల వశమైంది. టిప్పుసుల్తాన్ మరణం తరువాత స్వాతంత్రంవచ్చేవరకు ఇక్కడ ఆంగ్లేయుల పెత్తనం కొనసాగింది. చివరగా బ్రిటిషువారి చేతుల్లోకి వెళ్ళి 1980లో భారత పురావస్తు శాఖ అధీనంలోకి వచ్చింది. గండి కోట రక్షణలో మూడు విభాగాలు ఉన్నాయి. మూడువైపులా నీటి ప్రవాహంతో రక్షణ కలిగి ఉన్న జల దుర్గము, కొండలపై ఈ కోటను నిర్మించడంలో శత్రువుల రాకను అరికట్టే పర్వత దుర్గము, శత్రుదుర్భేద్యంగా కీకారణ్యాన్ని కలిగివున్న వన దుర్గము ఇలా గండికోటను పిలుచుకుంటారు. విజయనగర రాజుల ఏలుబడి తరువాత గండికోటపై పెమ్మసాని పాలకుల అధిపత్యం కొనసాగింది. ఒకప్పుడు ఈ ప్రాంతం వజ్రాల వ్యాపారానికి ప్రసిద్ధి చెందింది. అప్పట్లో విజయనగర సామ్రాజ్యాన్ని పెనుగొండను రాజధానిగా చేసుకుని పరిపాలించిన వెంకటపతి రాయలు, శ్రీరంగదేవరాయలు కాలంలో గండికోటలో బంగారు నాణెలు ముద్రించినట్లుగా ఆధారాలు ఉన్నాయి. వృత్తాకారంలో ఉండే కోట చుట్టు కొలత దాదావు 5కి.మీ. ఉంటుంది. ఇక్కడ పెన్నానది ఒంపులు తిరుగుతూ ప్రవహిస్తుంది. ఈ ప్రాంతంలో కొన్ని జలపాతాలు సైతం పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి.



## బలిష్టమైన కోట

కడప పేరు చెప్పగానే ప్రాచీన గండికోట గుర్తుకు రాక మానదు. ఇది ఒక చారిత్రక కట్టడం. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ కోట అప్పటి రాజుల పౌరుషాలకు, యుద్ధ తంత్రాలకు నిలయంగా చెబుతారు. కోట లోపల పర్యాటకులు చూడదగిన నిర్మాణాలు అనేకం ఉన్నాయి. ఈ కోట చుట్టూ మూడు రాతి ప్రాకారాలు ఉన్నాయి. పునాదులు లేకుండా కొండలపై కోట గోడలను నిర్మించడం విశేషం. ఎర్రగా, నున్నగా ఉన్న రాళ్ళను వినియోగించి 1,200 మీటర్ల పొడవు, 800 మీటర్ల వెడల్పు ఉన్న 101 బురుజులు కోట చుట్టూ ఉన్నాయి. మహా ద్వారాన్ని చేరడానికి 800 మెట్లు ఉన్నాయి. కోట లోపల మూడంతస్తుల కావలి మందిరం నేటికీ చెక్కు చెదరలేదు. గండికోటలో 'గిరి దుర్గాలు'గా పిలువబడే కోటలున్నాయి. వీటి నిర్మాణశైలి ఆశ్చర్యం కలిగిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం అంతగా అందుబాటులోలేని సమయంలోనే పునాదులే లేకుండా ఏర్పాటు చేసిన ఈ కోట నిర్మాణశైలి మహాద్భుతంగా ఉంది. కోట చుట్టూ ఉన్న పచ్చటి కొండలు, ఆ కొండల నడుమన ఉన్న పెన్నానది ప్రకృతి ఆరాధకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. కోట లోపలి జలయాలలోని గోడలపై అద్భుతమైన శిల్పం కనిపిస్తుంది. నృత్యభంగిమలో ఉన్న స్త్రీమూర్తులు, దేవతల శిల్పాలు సజీవంగా కనిపిస్తాయి. కోటలో చతురస్రాకారం, దీర్ఘ చతురస్రాకారపు బురుజులు 40 వరకు ఉన్నాయి. కోటలో పెద్ద ధాన్యాగారము, మందుగుండు సామగ్రి గిడ్డంగి,

ధాన్యాగారము, మందుగుండు సామగ్రి గిడ్డంగి, పావురాల గోపురం, మినార్లు చెప్పుకోదగ్గ కట్టడాలుగా ఉన్నాయి. నీటి వసతి కోసం చెరువులు, బావులు ఉన్నాయి. భూమి అడుగున గొట్టం ద్వారా ఏర్పరచిన నీటి సదుపాయం ఇక్కడి ప్రత్యేకత, ఈ కోటలో ఉన్న శాసనాల్లో అంబదేవుడు, కాకతీయ రాజైన ప్రతాపరుద్రుడి ప్రస్తావన ఉంది. విజయనగర సామ్రాజ్య చరిత్రలో కూడా గండి కోట ప్రస్తావన ఉండటం విశేషం. కోటలో పటిష్టమైన దర్వాజాలు కనిపిస్తాయి. ప్రకృతి సోయగాల నడుమ శత్రు దుర్భేద్యంగా నిర్మించిన గండికోట 11వ శతాబ్దానికి చెందినది. త్రైలోక్య మల్లరాజు, కళ్యాణి చాళుక్యుని ఆదేశంతో పెద్దముడియం పాలకుడిగా ఉన్న చిట్టిన చోళ మహారాజు (కాకరాజు) క్రీ.శ.1123 జనవరి 9న గండికోట నిర్మాణానికి పునాది వేసినట్లు 'గండికోట దుర్గం చరిత్ర'కు సంబంధించి లభించిన సాక్ష్యాధారాల వల్ల తెలుస్తోంది. కాక మహారాజు బొమ్మనపల్లి ప్రాంతాన్ని పరిపాలించాడు. కాకరాజు ఈ ప్రాంత వాసి కావడంతో పూర్తి అవగాహనతో కోట నిర్మాణానికి గండికోట అనువైన స్థలమని భావించాడు. పొలిమేర కావు ఓటన్న అధ్వర్యంలో పొలిమేరలు నిర్ణయించి కోట నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ విషయాలన్నీ కడప జిల్లాలో లభించిన పలు శాసనాల వల్ల తెలిసినవి. ఒకరోజు కాకరాజు తన అనుచరుడితో కలిసి వేటకై గండికోట ప్రాంతంలో వచ్చాడు. కాకరాజుకు ఈ ప్రాంతం బాగా నచ్చింది. ఇక్కడి కొండపై ఒక దుర్గం నిర్మిస్తే మహాద్భుతంగా ఉంటుందనేది ఆయన ఆలోచన. వెంటనే కోట నిర్మాణానికై సన్నాహాలు ప్రారంభించాడు. పెన్నానది సరిహద్దుగా ఈ కోట చుట్టూ అతి పెద్ద ప్రాకారాన్ని నిర్మించారు. కోట నిర్మాణానికి టన్నుకుపైగా బరువున్న రాళ్ళను ఉపయోగించారు. కోట ముఖద్వారానికి నిర్మించిన ఎత్తైన తలుపులు ఇనుపరేకులతో రావడం చేయబడి బలమైన సూచి మేకులు ఉంటాయి, దట్టమైన అడవుల మధ్య ఎంతటి బలమైన శత్రువు దాడినైనా ఎదుర్కొనడానికి అనువుగా ఈ కోట నిర్మాణం జరిగింది. సముద్రమట్టానికి 1670 అడుగుల ఎత్తులో నిర్మించిన అద్భుత కట్టడం గండికోట చాళుక్య రాజైన త్రైలోక్యమల్ల మహారాజుకు అప్పట్లో కాకరాజు సామంత రాజుగా ఉన్నారు. ఆయనే క్రీ.శ. 1123 జనవరి 9న గండికోటను నిర్మించినట్లు గ్రామ కైఫియత్తుల ద్వారా తెలుస్తోంది. ఈ కోట ఎన్నిసార్లు శత్రువుల దాడులకు గురైనా చెక్కు చెదరకుండా నేటికీ నిలిచివుంది. ఇందుకు కారణం కోట చుట్టుపక్కల ఉన్న ఎర్రారాయి అని చెప్పవచ్చు. 1700 నుంచి 2600 మిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన బలిష్టమైన ఎర్రని రాయి కావడమేనని భూ భౌతిక శాస్త్రవేత్తల అంచనా. చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు, పెమ్మసాని వంశీయులు, నవాబులు, ఆంగ్లేయుల పాలనలలో గండికోట సాంస్కృతిక వైభోగాలతో పాటు ఎన్నో యుద్ధాలకు సాక్షి భూతంగా నిలిచింది. చరిత్రలో మరెన్నో అద్భుతాలను ఆవిష్కరించింది. భావి తరాలు చెప్పుకునేందుకు వేదికైంది. కోట ప్రాకారం ఎర్రని, నున్నని బలిష్టమైన రాళ్ళతో నిర్మించారు. కొండ రాళ్ళపై పునాదులు లేకుండా గోడలు నిర్మించారు. ఈ గోడలు 10 నుండి 18 మీటర్ల ఎత్తు ఉన్నాయి.



చతురస్రాకారంలోను, దీర్ఘ చతురస్రాకారంలోను 40 బురుజులు ఉన్నాయి. గోడ పైభాగాన సైనిక సంచారం కోసం 5 మీటర్ల వెడల్పుతో ఒక బాట ఉంటుంది. వెడల్పుతో ఒక బాట ఉంటుంది.

## గండికోటలోని ఆలయాలు

గండికోటలో 21 దేవాలయాలు ఉన్నాయి. వాటిలో మాధవస్వామి ఆలయం ప్రత్యేకంగా చెప్పుకోదగింది. ఇక్కడి శిల్పకళ బహు రమణీయంగా ఉంటుంది. రఘునాథాలయం, వీరభద్రదేవళం, శివాలయం, భైరవుని గుడి ఇత్యాది ఉన్నాయి. పెన్నానది ఒడ్డున వెంకటరమణాలయం ఉంది. మూలవిరాట్టు రంగనాయకస్వామి విగ్రహం, అరుదైన శిల్పకళతో మాధవరాయస్వామి ఆలయం కనువిందుచేస్తున్నాయి. ప్రస్తుతం నేడు ఈ అలయాలన్నీ కొంత మేరకు శిథిలావస్థలో ఉన్నాయి.

## జుమ్మా మసీదు

ఇది అతి ప్రాచీనమైన మసీదు. జుమ్మా మసీదు, ప్రాకారం చుట్టూ బయట 64 గదులు, లోపల 32 గదులతో ఎంతో ఆకర్షణగా నిర్మించారు. బయట ఉన్న గదుల్ని గుర్రాలను కట్టేయడానికి, లోపలి గదులను సుదూర ప్రాంతం నుండే వచ్చే యాత్రికులు బస చేయడానికి ఉపయోగించేవారు. గండికోటలో జుమ్మా మసీదు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గోల్కొండ నవాబు ప్రతినిధిగా మీర్‌జుమ్లా కొంత కాలం గండికోటను పరిపాలించాడు. ఆయన పాలనాకాలంలో గండికోట లోపల జమ్మా మసీదును దక్కన్ శిల్ప శైలిలో నిర్మించాడు. ప్రస్తుతం ఇది ఒక పర్యాటక, చారిత్రక ప్రదేశం. ఈ మసీదు శిల్పశైలి పరమాద్భుతంగా రూపొందించారు. మసీదు ముందు భాగంలో నమాజ్ చేయడానికి వచ్చినవారు కాళ్ళూ, చేతులు కడుక్కుని నమాజ్ చేసుకోవడానికి చిన్న కొలను ఏర్పాటు చేశారు. భూగర్భంలో ఏర్పాటు చేసిన ఒక గొట్టం ద్వారా ఈ కొలనును నీటితో నింపేవారు. జుమ్మా మసీదుకు రెండు మీనారు ఉన్నాయి. వాటిపై పంచలోహాలతో చేసిన కలశాలు ఉండేవి గుప్తనిధుల వేటగాళ్ల వాటిని తస్కరించినట్లు తెలుస్తోంది.



## రాయల చెరువు


గండికోటలో ఎన్నో దిగుడుబావులున్నాయి. వీటితోపాటు రాయల చెరువు అనే కోనేరు ఉంది. ఈ కోనేరులో ఏడాది పొడవునా వుండే నీరు, చుట్టు పక్కల గ్రామాల సేద్యావసరాలను తీరుస్తుంది. గండికోటలోని రాయల చెరువులోని చల్లనినీ.. తాగకుండా ఏ పర్యాటకుడూ కూడా వెనుదిరగడు.

**(మిగతా 19వ పేజీలో)**

కథ

# పక్షి తంత్రం

**కొండయ్య** అనే రైతు కొడుకు కిరణ్. తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. రోజూ పాఠశాలకు వెళ్లడు. వెళ్లినా పాఠాలు వినడు,చదవడు. ఒకరోజు కొండయ్య తన కొడుకు కిరణ్‌ను పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు రమణయ్యగారి దగ్గరకు తీసుకెళ్లాడు. కొడుకును గురించి రమణయ్య మాస్టారుకు చెప్పాడు కొండయ్య. ఎలా అయినా తన కొడుకుని దారిలో పెట్టమని ఆయనను వేడుకున్నాడు. 'రోజు నీ కొడుకును నా వద్దకు పంపు' అన్నారు మాస్టారు. సరేనన్నాడు కొండయ్య.



కిరణ్ రమణయ్య మాస్టారు దగ్గరకు రోజూ వచ్చేవాడు కాదు. వచ్చినా ఎప్పుడో వచ్చేవాడు. కాసేపు ఉండి చెప్పకుండా వెళ్ళిపోయేవాడు.

ఒకరోజు రమణయ్య మాస్టారు కిరణ్‌కు రాయడం, చదవడం నేర్పాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. అంతలో ఎక్కడి నుండో ఒక చిలుక వచ్చి రమణయ్య మాస్టారు పక్కన వాలింది. దానిని పరిశీలనగా చూశారు మాస్టారు. దాన్ని రెక్కకు గాయమైంది. అందుకే అది ఎగరలేక పోతుంది. దాన్ని చేరదీసి చేతితో నిమిరారు మాస్టారు. గాయానికి కట్టు కట్టి, తినటానికి ఆహారం పెట్టారు. నాలుగు రోజుల్లో చిలుక గాయం నయం అయింది. అయినా సరే ఆ చిలుక రమణయ్య మాస్టారి ఇంట్లోనే, ఆయన చుట్టూ తిరుగుతూ ఉండిపోయింది.

మాస్టారు చిలుకకు రోజూ పదాలు నేర్పించసాగారు. కొన్ని రోజుల్లోనే చిలుక మాట్లాడటం, చిన్న చిన్న పాటలు పాడటం నేర్చుకుంది.

ఒకరోజు కిరణ్, 'చూశావా ఊర్లో వాళ్ళంతా చిలుకను మెచ్చుకుంటున్నారు” అన్నారు మాస్టారు. 'అది చిలుక కాబట్టి మీ మాట వింది. నేను వినను” అన్నాడు కిరణ్. అంటే నువ్వు చిలుక కంటే గొప్పవాడివని నీ ఉద్దేశం. కానీ ఊళ్ళో వాళ్ళు పక్షి అయ్యుండి చిలుక మాస్టారు చెప్పిన మాటలు చక్కగా నేర్చుకుంది. కిరణ్ మనిషై ఉండి కూడా ఏమీ నేర్చుకోలేకపోతున్నాడు. వాడికంటే చిలుకే నయం అనుకుంటున్నారు” అన్నారు మాస్టారు. అంతే, ఆరోజు నుండీ కిరణ్‌లో మార్పు వచ్చింది. చదువుపై శ్రద్ధ పెరిగింది. బుద్ధిగా చదువుకోసాగాడు. మంచిమార్కులతో పాస్ అయ్యాడు.

**- కళ్ళేపల్లి తిరుమలరావు**

## రంగులు వేయండి







## బాలగేయం

### దేశానికి పట్టు కొమ్మలం

భావి భారత పౌరులం
దేశానికి పట్టు కొమ్మలం
వేళకు పోయే పిడుగులం
అమ్మ చెప్పింది వింటాం
నాన్న చెప్పింది పాటిద్దాం
ఇంటిని శుభ్రముగా
ఉంచుదాం
అఆలుఇఈలు
నేర్చుకుంటాం
కఖల గుణింతాలు రాద్దాం
పెద్ద బాలశిక్ష
చదువుకుందాం
ఏబిసిడిలు దిద్దుదాం
హోమ్‌వర్క్‌లు చేద్దాం
టీచర్‌చే భేష్ అని
పించుకుంటాం
ఆదివారం ఆటలు పాటలు
పాడుదాం/ ఇసుకలో పిట్ట
గూడులు కడుదాం
ఇంద్ర ధనస్సులో ఏడు
రంగులు చూద్దాం
చినుకుల్లో తడుద్దాం
వానప్పు ఆడుదాం
సీతాకోక చిలుకలను ఆట
పట్టిద్దాం
చీకటి పడగానే ఇల్లు చేరు
కుందాం

**- పూసాల సత్యనారాయణ**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.పి.సర్వమంగళ,** అరుణాచలం

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. విమానాలను పక్షులు ఢీకొనే అవకాశముందని ప్రయాణాలను అర్థాంతరంగా ఆపివేస్తుంటారు. ప్రమాదం జరిగే అవకాశం ఎలా ఉంటుంది?**

**జవాబు: సర్వమంగళ!** ఈ ప్రమాదం ఎక్కువగా విమానాశ్రయాల దరిదాపుల్లోనే ఉంటుంది. ఒకవేళ అనుకోని రీతిలో విమానాలను పక్షులు ఢీకొంటే విమానాల ఇంజన్‌లు పాడైపోయే పరిస్థితి వస్తుంది. ప్రొపెల్లర్‌కి పక్షి ఢీకొని, ప్రొపెల్లర్‌లోకి దూసుకుపోయినట్లయితే, దాని శరీర భాగాలు ఇంజన్‌లోకి వెళ్లిపోతాయి. తత్ఫలితంగా ఇంజన్ భాగాలు జామ్ అవుతాయి. విమానం కూడా ఆగిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఎక్కువ శాతం ఈ తరహా ఘటనలు విమానాలు విమానాశ్రయాలలో టేకాఫ్ అయ్యేముందు సంభవించే అవకాశం ఉంది. అందువల్ల విమానాశ్రయం పరిసర ప్రాంతాలలో పక్షులు లేకుండా చూస్తారు. అవి పారిపోవడానికి తగిన ప్రయత్నాలు చేస్తారు. మరీ అవసరమైతే కాల్చివేస్తారు.

**- ఎన్.వాసుదేవన్,** తణుకు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. సాలీడు ఆహార పద్ధతి ఎలా ఉంటుంది?**

**జవాబు: వాసుదేవన్!** సాలీడు రోజుమొత్తంలో ఏదో ఒక కీటకాన్ని భోంచేసి విశ్రాంతి తీసుకుంటుంది. ఇంతలోనే మరో కీటకం గూడులో చిక్కుకుంటే ఆకలి లేదు కాబట్టి ఆ కీటకం మీదకు విషాన్ని విరజిమ్మి ఊరుకుంటుంది. చనిపోయిన ఆ కీటకం కదలికలు లేకుండా వున్న తర్వాత, చిక్కగా ఉన్న దారాలతో చుడుతుంది. మళ్లీ ఆకలి వేసినప్పుడు నింపాదిగా దానిని తింటుంది.



# కృష్ణమ్మ పరవళ్లు.. సోమశిల అందాలు..

చుట్టూ కొండా కోనలు..ఎటు చూసినా కృష్ణమ్మ పరవళ్లు..తాకుతున్నట్లు కనువిందు చేసే అలలు..చల్లని స్వచ్ఛమైన గాలి..లాహిరి లాహిరి.. లాహిరిలో అంటూ లాంచి ప్రయాణం ఇవన్నీ సోమశిల కృష్ణమ్మ సొంతం. కృష్ణమ్మ అందాలు ఇట్టే కట్టిపడేస్తాయి. ఒక్కసారి చూస్తే మళ్లీమళ్లీ చూడాలనిపించే ప్రాంతం. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల క్షేత్రం ప్రకృతి రమణీయత నడుమ విరాజిల్లుతున్నది. వేల ఏండ్ల చరిత్ర కలిగిన పుణ్యక్షేత్రం నుంచి నదీ మీదుగా లాంచిలో సుమారు ఆరున్నర గంటలు ప్రయాణించడం


సోమశిల నదీ ఒడ్డున కాటేజీలు

అంటేనే ఆ అనుభూతి తలుచుకుంటేనే ఎంతో ఆనందంతో పాటు ఆహ్లాదాన్నిస్తుంది. లాంచి ప్రయాణానికి సంబంధించిన ప్యాకేజీలను తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ సిద్ధం చేసింది. ప్రతి శనివారం లాంచి ప్రయాణం చేసే అవకాశం కల్పించింది. ఆ వివరాలతో వార్త ప్రత్యేక కథనం..

**లాంచి(క్రూయిజ్) ప్రయాణం..**

సోమశిల నుంచి కృష్ణానదిలో లాంచి ప్రయాణం చేస్తూ శ్రీశైలం చేరుకోవచ్చు. పర్యాటకుల కోసం అధికారులు లాంచీలను సిద్ధం చేశారు. ఈనెల 2శనివారం నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్స్ ప్రారంభం చేయగా లాంచి ప్రయాణం ప్రారంభించారు. సోమశిల నుంచి ప్రతి శనివారం ఉదయం లాంచిలో బయలు దేరితే సుమారు ఆరు గంటలు ప్రయాణించిన అనంతరం శ్రీశైలం చేరుకుంటారు. అక్కడే భక్తులు, పర్యాటకులు శ్రీశైల మల్లన్న దర్శనం చేసుకోవచ్చు. రాత్రి అక్కడే బస చేయాల్సి ఉంటుంది. తిరిగి ఆదివారం ఉదయం 9గంటలకు లాంచి శ్రీశైలం నుంచి సోమశిలకు బయలుదేరుతుంది. లాంచిలో భోజన సౌకర్యంతోపాటు స్నాక్స్ కూడా అందజేశారు. ఇందుకు పిల్లలకు, పెద్దలకు. ఏసీ లాంచి, సింగిల్ వన్ వే జర్నీ ఇలా విభాగాల వారీగా చార్జీలు ఉంటాయి.

**ఫిబ్రవరి వరకు బోటింగ్..**

ప్రతి శనివారం ఉదయం 9గంటలకు సోమశిల నుంచి బయలుదేరుతుంది..శనివారం రాత్రి శ్రీశైలంలోనే బస చేసి దర్శనం చేసుకోవాలి. తిరిగి ఆదివారం ఉదయం 9గంటలకు శ్రీశైలం నుంచి సోమశిలకు బయలుదేరుతుంది. కృష్ణా నదిలో నీళ్ల సమృద్ధిగా ఉండటంతో సోమశిల నుంచి శ్రీశైలం వరకు, నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్ టూర్‌ని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శనివారం ప్రారంభించింది. సోమశిల నుంచి శ్రీశైలం వరకు 120 కి.మీ. దూరం కాగా 6.30 గంటల టైం పట్టింది. ఈ జర్నీలో అబ్బురపరిచే దృశ్యాలెన్నో ఉన్నాయి. ప్రతి శనివారం ప్రారంభమయ్యే టూర్, నదిలో నీటి మట్టం ఆధారంగా ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉందని టూరిజం కార్పొరేషన్ వర్గాలు తెలిపాయి. ఆ రాష్ట్రంలో పర్యాటకాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసేందుకు తెలంగాణ సర్కార్ కొత్త పాలసీని తీసుకువస్తోంది. మరిన్ని వివరాలకు సోమశిల లాంచి ఇన్‌చార్జి శివకృష్ణ 7731854994 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

**ప్యాకేజీలు ఇలా..**

సోమశిల నుంచి శ్రీశైలం లాంచి ప్రయాణానికి వివిధ రకాల ప్యాకేజీలను పర్యాటక శాఖ సిద్ధం చేసింది. సుమారు 120మంది ప్రయాణించే లాంచి డబుల్ డెక్కర్ తరహాలో ఉంటుంది. ప్రయాణానికి పెద్దలకు రూ.3వేలు, చిన్నారులకు రూ.2400 ధర నిర్ణయించారు. ఏసీ లాంచీలో ప్రయాణానికి సంబంధించి పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా టికెట్ ధరలు నిర్ణయించారు. సింగిల్ జర్నీ వన్ వేకు పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1600 రానుపోను ప్రయాణానికి సంబంధించి పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు రూ.2400గా నిర్ణయించారు. అయితే ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభం కానుండగా అలల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా బుకింగ్స్ వారం రోజులపాటు పోస్ట్‌పోన్ చేశారు. నవంబర్ 2నుంచి తిరిగి ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్ బుకింగ్స్‌కు సంబంధించి తెలంగాణ టూరిజం వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

**వీకెండ్ స్పాట్..**

హైదరాబాద్ లాంటి నగర వాసులకు నాలుగు గంటల ప్రయాణ దూరంలో ఒక మంచి వీకెండ్ స్పాట్‌గా సోమశిల ఉన్నది. రహదారులు కూడా చాలా విశాలంగా ఉండడంతో వెళ్లి రావడానికి చాలా ఈజీగా కూడా ఉంటుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి సొంత వాహనాల్లోనూ, ఆర్టీసీ బస్సు సౌకర్యంతోనూ సులభంగా వెళ్లే పర్యాటక ప్రదేశం. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు అతి దగ్గరలో ఉంటుంది. ఇక్కడ ప్రధానంగా చెప్పుకునేది ఏడో దశాబ్దం కాలం నాటి పురాతన ఆలయాలు. దీంతో సోమశిల ఆధ్యాత్మిక ప్రదేశంగా విరాజిల్లుతున్నది.


సోమశిల క్షేత్రం

ఇక్కడ తెలంగాణ టూరిజం హరిత హోటల్ వారి కాటేజీలు కూడా ఉన్నాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ సదుపాయం కూడా ఉన్నది. శనివారం సాయంత్రం సోమశిలకు వచ్చేలా ప్లాన్ వేసుకుంటే రాత్రి అక్కడే నది అందాలు చూసుకుంటూ బస చేసి ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూలు నిర్వహించుకోవచ్చు.

**15 దేవాలయాలు..**

సోమశిల ప్రాంతంలో మొత్తం 15 దేవాలయాలు ఉన్నాయి. అవన్నీ ఎన్నో ప్రసిద్ధిగాంచిన ఆలయాలుగా గుర్తింపు పొందాయి. అందులో ప్రధానంగా సోమశిల వద్ద నదిలో ఉండే సంగమేశ్వరాలయం. అది నదిగర్భంలో ఉండడంతో వర్షాకాలం మొత్తం నదిలో మునిగి ఉంటుంది. నీటిమట్టం తగ్గాక సుమారు మార్చి నుంచి నాలుగైదు నెలల పాటు ఆలయం తేలి ఉంటుంది. అందుకే వేసవి సమీపించే సమయంలో భక్తులకు దర్శనభాగ్యం కలుగుతుంది. ఒకవైపు దట్టమైన అడవులు, మరోవైపు ప్రకృతిసోయగాల కృష్ణానది బ్యాక్ వాటర్ అందాలను రెట్టింపు చేస్తాయి. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగు ప్రయాణం మరింత మధురానుభూతిని ఇస్తుంది. అంతటి ప్రకృతి ఒడిలో ఉన్న సోమశిల క్షేత్రం నుంచి శ్రీశైలం జలాశయానికి లాంచిలో ప్రయాణించడం జీవితాంతం గుర్తుండిపోయే ఓ అనుభూతిలా మిగిలిపోతుంది. పుష్కర సమయంలో లక్షలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి వెళ్తుంటారు. శివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు ఆచరిస్తారు. నదిలోనూ నీరు పుష్కలంగా ఉండడం మూలంగా





లాంచి

ఏడాదిలో సుమారు 8నెలలపాటు అక్కడ బోటింగ్ సదుపాయం ఉంటుంది. బోటింగ్ ద్వారా అవుతలి గట్టుకు చేరుకొని అక్కడి నుంచి ఆటోలు ఇతర ప్రైవేట్ వాహనాల్లో కర్నూల్ సైతం చేరుకోవచ్చు. సోమశిల వద్ద ఉన్న రెండు కొండల మీదుగా కేంద్ర ప్రభుత్వం బ్రిడ్జి నిర్మించేందుకు ఇప్పటికు టెడర్లు సైతం ఆహ్వానించగా పనులు ప్రారంభమయ్యాయి.

**ఎలా వెళ్లాలి..** తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి సోమశిలకు సుమారు 200కి.మీ. దూరం ఉంటుంది. ఏడాది పొడవునా పర్యాటకులను ఆకర్షిస్తుంది. హైదరాబాద్ నుంచి వచ్చేవారు ఎంజీబీఎస్ నుంచి కొల్లాపూర్‌కు నేరుగా ఆర్టీసీ బస్సులు ఉంటాయి. నాగర్‌కర్నూల్ చేరుకొని కూడా అక్కడి నుంచి కొల్లాపూర్ చేరుకోవచ్చు. వనపర్తి నుంచి వచ్చే వారు నేరుగా కొల్లాపూర్ చేరుకోవచ్చు. అక్కడి నుంచి 8కి.మీ.దూరంలో సోమశిల ఉంటుంది.

**– నెటవెట్ల సతీష్‌కుమార్ రెడ్డి**

## ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనియన్ గండికోట

**(15వ పేజీ తరువాయి)** ఈ నీటితో ఇక్కడి అరటి తోటలకు సమృద్ధిగా నీరు లభిస్తుంది. మైలవరం పురావస్తు మ్యూజియం ఉంది. కత్తుల కోనేరు, ధాన్యాగారం, మందుగుండు సామాగ్రి గిడ్డంగి, పావురాళ్ళ గోపురం, జైలు రంగమహలు, ఇంకా అనేక చెరువులు, దావులు ఇక్కడ ఉన్నాయి. గతంలో గొట్టాల ద్వారా భూమి అడుగున నీటి సదుపాయ కల్పించడం ఇక్కడి ప్రత్యేకత,

వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన గండికోటను అభివృద్ధి పరచి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్మోహనరెడ్డి కృషి శ్లాఘనీయమైనది. విదేశీ పర్యాటకుల్ని సైతం విశేషంగా ఆకర్షించేందుకు నిధులు కేటాయించి గండికోటను తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. దక్షిణానికి చెందిన అనేక చలన చిత్రాలను ఇక్కడ నిర్మించారు. అయితే ఇంకా అభివృద్ధి చేసి 'ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనియన్' ప్రసిద్ధి చెందిన గండికోటను పర్యాటకుల రద్దీ పెరిగేలా చేయవలసిన అవశ్యకత ఉంది. అమెరికాలోని 'గ్రాండ్ కెనియన్' నిర్మించినట్లు స్కైవాక్ను ఇక్కడి లోయ వద్ద ఏర్పాటు చేస్తామని హామీలు కూడా గుప్పించారు. గండికోట వారసత్వ ఉత్సవాల పేరుతో ఇక్కడ పలుమార్లు ఉత్సవాలు నిర్వహించినప్పటికీ పలు హామీ నెరవేరలేదు. రోప్వే పనులు అసంపూర్తిగానే మిగిలాయి. ఇక్కడి మైలవరం జలశయంలో బోటింగ్ ఏర్పాటు చేస్తామని బోర్డులు ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఇక్కడకు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. బోటింగ్ లేకపోవడంతో నిరాశగా వెళుతున్నారు. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో సునీల్, సలోనీ నటించిన మర్యాదరామన్న చిత్రం సగభాగానికిపైగా గండికోటలోనే షూటింగ్ జరుపుకుంది. గోపిచంద్, తాప్సీ నటించిన సాహసం చిత్రంలో అనేక సన్నివేశాలు ఇక్కడే చిత్రించారు. తెలుగుతో పాటు అనేక తమిళ చిత్రాలు కూడా ఇక్కడ నిర్మించారు. పురావస్తు త్రవ్వకాలలో బయల్పడిన నిజాలు పురావస్తు శాఖవారు ఇక్కడ జరిపిన త్రవ్వకాలలో చారిత్రక అవశేషాలు, నేలమాళిగలు, ఫిరంగిగుండ్లు, అనాటి మానవుడు వాడిన ఎన్నో వస్తు పరికరాలు వెలుగు చూడటంతో గండికోట మరోసారి చర్చనీయాంశమైంది. వీటిని పరిశీలించడం వల్ల ఆనాటి రాచరిక పాలన అనవాళ్లు తెలుస్తున్నాయి. శిథిలదుర్గంలో నిక్షిప్తమై ఉన్న అపారమైన, అపురూపమైన చారిత్రక సంపదకు కొదవేం లేదు. పెన్నా, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలలో ఉన్న గనుల్లో లభించే వజ్రాలను గండికోట కేంద్రంగా సేకరించి విదేశాలకు ఎగుమతి చేసేవారనేది చరిత్ర చెబుతోంది. ●



# రాతిగుండె

**గన్నవరపు నరసింహమూర్తి**



**"హలో! కళ్యాణీ! నేనమ్మా మీ నాన్నని మాట్లాడుతున్నాను" అన్నాడు రంగనాథ్.**

**"చెప్పండి నాన్నా! బాగున్నారా? మీ ఆరోగ్యం ఎలా ఉంది" అని అడిగింది కళ్యాణి.**

**"బాగానే ఉన్నానమ్మా! రెండు రోజుల నుంచి వంటావిడ సావిత్రి రావటం లేదు. నేనే వండుకుంటున్నాను. నిన్నే డాక్టరు గారికి చూపించుకున్నాను. అంతా బాగుందనీ చెప్పారు" అని చెప్పాడు రంగనాథ్.**

"అన్నయ్య మాట్లాడుతున్నాడా? వారం క్రితం నాతో మాట్లాడేడు. మీ అల్లుడుగారు మొన్ననే ఆస్ట్రేలియా వెళ్ళారు. ప్రస్తుతం నేను, పిల్లాడే ఉంటున్నాం, అతను వచ్చేదాకా ఆఫీసుకి సెలవు పెట్టాను" అనీ చెప్పింది కళ్యాణి.

"వారం క్రితం మాట్లాడేడు; సంక్రాంతి పండగకి రమ్మన్నాను, కుదరదని చెప్పాడు. కనీసం మీరైనా రండి" అన్నాడు రంగనాథ్.

"మాకూ కుదరదు నాన్నగారూ! సెలవులు దొరకవు. వీలుంటే వేసవికి ప్రయత్నిస్తాం" అంది కళ్యాణి.

"రెండేళ్ళైంది మీరొచ్చి; సంవత్సరానికోసారైనా రావడానికి ప్రయత్నించండి. కనీసం నువ్వు వారానికోసారైనా మాట్లాడతావు: మీ అన్నైతే నెలకోసారైనా మాట్లాడడు. ఏమైనా అంటే బిజీ అంటాడు. తండ్రితో మాట్లాడటానికి మీకు ఐదు నిమిషాలు సమయం కూడా దొరకటం లేదా? అరవై ఏళ్ళ తండ్రి అన్నవాడు వేల మైళ్ళ దూరంలోని దేశంలో ఒంటరిగా ఉంటున్నాడన్న బాధ కూడా మీ ఇద్దరికీ లేదు. ఏం చేస్తాం? ఇది నా ఖర్మ" అన్నాడు రంగనాథ్ కోపంగా.

"నాన్నా! మేం ఉంటున్నది అమెరికాలో, ఇండియాలో కాదు. ఇక్కడ ప్రతీవాళ్ళు పనుల్లో చాలా బిజీగా ఉంటారు. ఎవరి పనులు వాళ్ళే చేసుకోవాలి. మేం ఇక్కడికి బతుకు తెరువు కోసం వచ్చాం. కానీ ఎంజాయ్ చెయ్యడానికి కాదు. అన్నీ తెలిసి మీరు ఇలా మాట్లాడితే ఎలా?" మిమ్మల్ని ఇక్కడికి రమ్మనమని చెబితే మీరు రారు. ఇలా అయితే ఎలా చెప్పండి?" అంది కోపంగా కళ్యాణి.

"ఈ వయసులో అక్కడికి నేనెలా రాగలను చెప్పు? ఇక్కడైతే తెలిసిన వాళ్ళున్నారు కాబట్టి సమయం గడిచిపోతోంది. కానీ అక్కడైతే నాలుగు గోడల మధ్య నాకు పిచ్చెక్కిపోతుంది. మీ తండ్రి వయసుని దృష్టిలో పెట్టుకొని మాట్లాడితే బాగుంటుంది. తల్లితండ్రుల అవసరం తీరిపోగానే పక్షుల్లా మీరు ఎగిరిపోయారు. మీకే బాధ్యతా అక్కర్లేదు. ఎంతసేపూ మీరూ, మీ కుటుంబం.. అంతే! సరే... ఉంటాను" అనీ ఫోన్ పెట్టేసాడు రంగనాథ్ కోపంగా.

రంగనాథ్ ఐదేళ్ళ క్రితం ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసాడు. రెండేళ్ళ క్రితం అతని భార్య అన్నపూర్ణ చనిపోయింది.

ఆరేళ్ళ క్రితం ఇద్దరి పిల్లలకూ పెళ్ళిళ్ళు చేసాడు రంగనాథ్. ఇద్దరూ అమెరికాలోనే ఉంటున్నారు.

కొడుకు వంశీ, కోడలు మాధవి సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు; వాళ్ళు సియాటల్లో ఉంటారు. కూతురు కళ్యాణి, అల్లుడు రఘు కాలిఫోర్నియాలో ఉంటారు. వాళ్ళు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. ఇద్దరికీ పిల్లలు. కళ్యాణికి కొడుకు హర్ష వంశీకి కూతురు స్మిత.

రంగనాథ్‌కి మనవలతో మాట్లాడాలని ఉంటుంది.. కానీ వాళ్ళు ఎప్పుడూ మాట్లాడరు. కొడుకూ, కూతురే మాట్లాడరు. ఇంక మనవలెక్కడ మాట్లాడతారు? ఒకవేళ రంగనాథ్ వాళ్ళతో మాట్లాడదామనీ ఫోన్ చేస్తే బిజీగా వున్నాం తరువాత మాట్లాడతామనీ ఫోను పెట్టేస్తూ ఉంటారు.

భార్య అన్నపూర్ణ చనిపోయిన దగ్గర్నుంచీ రంగనాథ్ ఒంటరిగా ఉంటున్నాడు. కొడుకు అమెరికా రమ్మనమని అతన్నీ అడిగినా వెళ్ళలేదు. అయినా అక్కడికి వెళ్ళడం రంగనాథ్‌కు ఇష్టం లేదు. సంవత్సరానికోసారైనా పిల్లలు ఇంటికి వస్తే బాగుంటుందనీ రంగనాథ్ అనుకుంటూ ఉంటాడు. కానీ వాళ్ళు ఏవో సాకులు చెప్పి వాయిదా వేస్తుంటారు. భార్యా వియోగం, దానికితోడు ఒంటరితనం వల్ల రంగనాథ్ ఆరోగ్యంలో మార్పులు రాసాగాయి. అతనిలో నిరాశ, నిస్పృహలు ఎక్కువ య్యాయి. దానికితోడు అతనికి పెద్దగా స్నేహితులు కూడా లేకపోవడంతో కాలం గడవక బాధపడుతూ ఉంటాడు.

ఆరోజు ఆదివారం. ఉదయాన్నే లేచి టీ తాగి వాకింగ్‌కి బయలుదేరాడు. ఇది రోజు అతని దినచర్య. ఆదివారం కాబట్టి మెయిన్ రోడ్డుకి వచ్చాడు. రోడ్డు మీద వాహనాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతిరోజూ అతను తన ఇంటి దగ్గర ఉన్న పార్కుకి వెళుతుంటాడు. కానీ ఈ రోజు కాయగూరలు కొనాలని మెయిన్ రోడ్డు మీదకు వచ్చాడు. అందుకే ఈ రణగొణ ధ్వని.. వందల వందల వాహనాలు..

మధ్యలో మోటార్ సైకిళ్ళు, ఆటోలు.. రోడ్డు మీద నడవటానికి ఇబ్బందిగా ఉంది. రెండుసార్లు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు.

ఇంతలో ఒక కారు అతన్ని దాటి కొద్దిగా ముందుకి వెళ్ళి ఒక బేకరీ ముందర ఆగింది.

కారు ఆగగానే ఒక ఐదేళ్ళ అబ్బాయి కారు నుంచి దిగాడు, అతని వెనక సుమారు ముప్పై ఏళ్ళ ఒక స్త్రీ దిగింది. అప్పటికే ఆ అబ్బాయి పరుగున బేకరీ దగ్గరికి పరిగెత్తాడు.

"వంశీ! ఆగు, డాడీ వస్తారు" అనీ ఆమె చెబుతున్నా ఆ అబ్బాయి వినకుండా ఆ బేకరీ దగ్గరకు పరిగెత్తుతున్న సమయంలో ఎదురుగా ఒక మోటార్ బైక్ వేగంగా వస్తూ రంగనాథ్ కంటపడింది. ఆ వేగాన్ని చూడగానే అతని మనసెందుకో కీడుని శంకించింది. ఏం చెయ్యాలో అతనికి తోచలేదు. ఒక పక్క పరిగెడుతున్న ఐదేళ్ళ కుర్రాడు, ఇంకో పక్క వాయువేగంతో ఎదురుగా వస్తున్న మోటార్ బైక్.

ఒక్కసారిగా అతను వేగంగా వెళ్ళి ఆ అబ్బాయి చేయిపట్టుకొని పక్కకి లాగడం, అదే సమయంలో మోటార్ బైక్ అతన్ని రాసుకుంటూ వెళ్ళిపోవడం క్షణ కాలంలో జరిగిపోయాయి. ఒక్క క్షణం ఆలస్యం అయి ఉంటే ఆ అబ్బాయి మోటార్ బైక్ కింద పడిపోయి ఉండేవాడు.

ఇదంతా తృటిలో జరిగిపోయింది. అందరూ జరిగిన ఘటనని ఆశ్చర్యంతో చూడ సాగారు. ఏం జరిగిందో ఎవ్వరికీ అర్థం కావటం లేదు.

ఇంతలో ఆ అబ్బాయి తల్లి రంగనాథ్ దగ్గరకు వచ్చి "చాలా థాంక్సండీ! మీరేగనీ లేకపోతే ఈరోజు మావాడు మాకు దక్కేవాడు కాదు" అంది చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ.

రంగనాథ్ ఆ అబ్బాయి చేయి వదులుతూ"ఆ బైక్ అతను రాంగ్ రూట్లో వచ్చాడు. అందుకే అతను బండిని ఆపకుండా వెళ్ళిపోయాడు" అన్నాడు ఆమెతో.

ఇంతలో ముప్పై ఏళ్ళ పైబడ్డ ఓ వ్యక్తి అక్కడికి వచ్చాడు

"రఘూ! ఈ రోజు అంకుల్ గారు లేకపోతే వంశీ మనకి దక్కేవాడు కాదు. వీడు పరిగెత్తుకు వెళుతుంటే ఎదురుగా వేగంగా ఓ బైక్ ఢీ కొట్టబోయింది. అదృష్టవశాత్తు సార్ వీడిని పక్కకి లాగి రక్షించారు" అంది అతనితో.

"వాడి చెయ్యి ఎందుకు వదిలేసావు? నేను కారు పార్కింగ్ చేసి వచ్చేలోగా ఎందుకు తొందర?" అనీ ఆమెతో కోపంగా అన్నాడతను. ఆ తరువాత అతను రంగనాథ్ వైపు తిరిగి "చాలా థాంక్సండీ. ఈరోజు వీడి పుట్టినరోజు. అందుకే బిస్కెట్స్, చాక్‌లెట్స్, ఐస్క్రీములు కొనడానికి వచ్చాం అదృష్టవశాత్తూ మీ దయవల్ల వీడికేమి కాలేదు. ఆ దేవుడే మీ రూపంలో వచ్చాడు" అన్నాడు అతను.

"అయ్యో! అంత మాటెందుకు? నేనేంటి! నా స్థానంలో ఎవరున్నా అదే పని చేస్తారు. పిల్లవాడిని చూస్తూ ఎలా వదిలేస్తాం చెప్పండి? అయినా ఆ బైకు వాడికి బుద్ధి ఉండాలి" అన్నాడు రంగనాథ్.

మా అబ్బాయి వంశీ. కాన్వెంట్లో చదువుతున్నాడు" అనీ చెప్పాడతను.

ఇంతలో వాళ్ళ దగ్గరికి వెయిటర్ రాగా అతను కాఫీలు తెమ్మనీ చెప్పాడు.

"సార్! మీరు ఏం చేస్తుంటారు?" అనీ ఆమె అడిగింది.

"నా పేరు రంగనాథ్, నేను ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేసి పదవీ విరమణ చేసాను." అనీ చెప్పాడు రంగనాథ్.

"ప్రొఫెసర్ గారూ! మీరు ఎక్కడ ఉంటున్నారు?" అనీ అడిగాడు రఘు.

"నేను న్యూకోలనీలో ఉంటాను"

"మరి మీ పిల్లలు?"

"నాకు ఇద్దరు పిల్లలు. వాళ్లిద్దరూ అమెరికాలో ఉంటున్నారు. నా భార్య సంవత్సరం క్రితం చనిపోయింది. ప్రస్తుతం నేను ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాను "అని చెప్పాడు రంగనాథ్.

**"రఘు గారూ ! ఈ రోజు మీ అబ్బాయి వంశీ పుట్టినరోజు అయినందుకు వాడికి నా శుభాకాంక్షలు. నాకు పుట్టిన రోజులకు వెళ్లడం అలవాటు లేదు. దయచేసి ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోవద్దు" అన్నాడు రంగనాథ్.**

"సార్! రండి, కాఫీ తాగుదాం" అన్నాడా వ్యక్తి.

"పరవాలేదు. నేను వెళతాను" అనీ రంగనాథ్ వెళ్ళిపోతుంటే ఆ స్త్రీ అతనికెదురుగా వచ్చి "దయచేసి రండి; కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం. ఈ రోజు మీరు చేసిన పని సామాన్యమైనది కాదు. వీడు మాకు లేకలేక పుట్టాడు. ఏదైనా జరిగి ఉంటే మేం తట్టుకోలేక పోయేవాళ్ళం" అంది ఆమె.

ఆమె మాటలు వినగానే అతనికేం చెప్పాలో అర్థం కాలేదు. అందుకే వాళ్ళతో పాటే బేకరీలోకి నడిచాడు. లోపల పెద్ద హాల్లో కుర్చీలు, టేబుళ్ళు వేసి ఉన్నాయి .

రంగనాథ్ కూర్చోగానే అతని పక్కన ఆ పిల్లవాడు వచ్చి కూర్చున్నాడు. ఎదురుగా భార్యాభర్తలు కూర్చున్నారు. వాళ్ళ ముఖాల్లో ఆందోళన ఇంకా స్పష్టంగా అతనికి కనిపిస్తోంది.

"సార్! నా పేరు రఘు: ఇక్కడ ఓ కంపెనీలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను. ఈమె శృతి, నా భార్య. టీచరుగా పనిచేస్తోంది. వీడు

ఇంతలో వెయిటర్ కాఫీలు తెచ్చాడు. అతను కాఫీ తాగుతుంటే వాళ్ళిద్దరూ కౌంటర్ దగ్గరికి వెళ్ళి ఏవేవో ఆర్డరివ్వ సాగారు. కొద్దిసేపటి తరువాత వాళ్ళిద్దరూ అతని దగ్గరకు వచ్చారు.

"ప్రొఫెసర్ గారూ! ఈరోజు మా వంశీ పుట్టినరోజు. ఈ రోజు మీరు వీడిని దేవుడిలా కాపాడారు. మీరు ఆ క్షణం వాడిని రక్షించకపోతే ఏం జరిగేదో తలుచుకుంటేనే భయం వేస్తోంది. ఈరోజు మీరు లంచ్‌కి మా ఇంటికి రావాలి" అంది శృతి.

"అవును ప్రొఫెసర్‌గారూ! మీరు తప్పక లంచ్‌కి మా ఇంటికి వచ్చి మా వంశీని ఆశీర్వదించాలి" అని అన్నాడు రఘు.

"రఘుగారూ ! ఈ రోజు మీ అబ్బాయి వంశీ పుట్టినరోజు అయినందుకు వాడికి నా శుభాకాంక్షలు. పుట్టిన రోజు ఫంక్షన్లకు వెళ్లడం నాకు అలవాటు లేదు. దయచేసి ఇలా అంటున్నందుకు ఏమీ అనుకోవద్దు" అన్నాడు రంగనాథ్.

"లంచ్‌కి మీరు తప్ప ఎవ్వరూ రారు.

వాడి స్నేహితులు, మా స్నేహితులు, బంధువులు రాత్రి హోటల్‌కి వస్తారు. అక్కడే వాడి పుట్టినరోజు జరుపుతాం. కాబట్టి కాదనకుండా మీరు రావాలి. మీరు వస్తే మాకు చాలా సంతోషం కలిగించినవారవుతారు“ అంది శృతి.

వాళ్ళు అంత ఆప్యాయంగా పిలిచేసరికి అతనికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. అందుకే వస్తాననీ చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం ఒంటి గంటకు అతను వాళ్ళు చెప్పిన చిరునామాకి లంచ్‌కి బయలుదేరాడు. అక్కడికి వెళ్ళేసరికి ఆ దంపతులిద్దరూ అతని కోసం బయట ఎదురు చూస్తూ కనిపించారు.

అతన్ని చూస్తునే వాళ్ళు ఆనందంగా ఇంట్లోకి ఆహ్వానించారు. కొద్దిసేపటికి లంచ్ ప్రారంభమైంది. రంగనాథ్, రఘు డైనింగ్ టేబుల్ మీద కూర్చుంటే శృతి వాళ్ళిద్దరికీ వెండిపళ్ళాల్లో వడ్డించటం మొదలు పెట్టింది.



**"ప్రొఫెసర్ గారూ! మీరు ప్రతీ వారం మా ఇంటికి వస్తూ ఉండండి. మిమ్మల్ని చూస్తుంటే నాకు మా నాన్నగారు గుర్తుకు వస్తున్నారు" అనీ చెప్పింది శృతి.**

లంచ్ కోసం బోలెడు వంటకాలు చేసింది శృతి. పప్పు, కూరలు, సాంబారు, పచ్చళ్ళు, ఆవకాయలు, పళ్ళు, స్వీట్లు.. ఇలా చాలా పదార్థాలు వడ్డించింది.

నిజానికి రంగనాథ్ చాలా తక్కువగా తింటాడు కానీ శృతి ఆప్యాయంగా వడ్డిస్తుంటే అతను కాదనలేకపోయాడు. రఘు కూడా దగ్గరుండి అతనికి నెయ్యి, పచ్చళ్ళు, ఆవకాయలు వడ్డించడం మొదలు పెట్టాడు. ఉదయం వరకు అతనంటే ఎవరో తెలియని ఆ దంపతులు ఇంత ఆప్యాయంగా, ప్రేమతో భోజనం వడ్డిస్తుంటే అతనికి ఆనందంతో పాటు ఉద్వేగ్నత కలగసాగింది. వాళ్ళ ఆప్యాయతకు అతనికి కళ్ళు చెమ్మగిల్లసాగాయి.

“ప్రొఫెసర్ గారూ! మీరు ప్రతీ వారం మా ఇంటికి వస్తూ ఉండండి. మిమ్మల్ని చూస్తుంటే నాకు మా నాన్నగారు గుర్తుకు వస్తున్నారు” అనీ చెప్పింది శృతి.

ఆమె ప్రేమకు రంగనాథ్‌కు ఏం చెప్పాలో అర్థం కాలేదు.. కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. “అమ్మా! మీ ప్రేమాభిమానాలు, ఆప్యాయతలను చూస్తుంటే నాకు ఏం చెప్పాలో అర్థం కావటం లేదు. చాలా రోజుల నుంచి నా మనసు మా పిల్లల ప్రవర్తనతో మొద్దుబారిపోయింది. ఇప్పుడు మీరు చూపిస్తున్న ఈ ప్రేమ నా గుండెను పిండేస్తోంది. దయచేసి ఇంతటి ఆప్యాయతను నా మీద కురిపించవద్దు. దీన్ని నేను తట్టుకోలేను. ఎందుకంటే నేను నా ఇంట్లో ఒంటరిగా గడపాలి. మీరు అతిగా నా మీద ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తే అవి రోజు నా పిల్లల నుంచి దొరకక నా మనసు గాయపడే ప్రమాదం ఉంది.

మా పిల్లల ప్రవర్తనతో విసిగిపోయి నేను నా మనసును రాయిగా మార్చుకున్నాను. అది మీ ప్రేమ, ఆప్యాయతలతో మళ్ళీ కరిగిపోతే ఆ బాధని నేను తట్టుకోలేను. కాబట్టి నన్ను ఒంటరిగానే ఉండనీయండి. అప్పుడే మీరు నాకు మేలు చేసినవారవుతారు” అని ఆ దంపతులకు చెప్పి ఇంటికి వచ్చేసాడు.

అతను బయటకు వచ్చేస్తుంటే ఆ దంపతులిద్దరూ ఆశ్చర్యంగా అతని వైపు చూస్తూ నిలబడిపోయారు. ■

# రంగు రంగుల బీచ్‌లు

**బీచ్ అంటే సముద్రం, అప్పుడప్పుడు వచ్చి పోయే అలలు, గోధుమ వర్ణంలో ఉండే ఇసుకలో పిట్టగూళ్ల కట్టుకునే పిల్లలు.. అనీ అనుకుంటాం సాధారణంగా. అయితే ప్రపంచంలో కొన్ని బీచ్‌లలో ఇసుక విభిన్న రంగుల్లో ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఖనిజాల వల్ల ఇసుక వివిధ రంగుల్లో ఉంటుంది. :**

**పింక్ శాండ్ బీచ్, ఇండోనేషియా:** ఇక్కడ ఇసుక లేత గులాబీ రంగులో ఉంటుంది. ఈ బీచ్‌కి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు.




**పోర్టో ఫెర్రో బీచ్, ఇటలీ:** ఇటలీలోని సార్డినియాలో ఉన్న ఈ బీచ్‌లో ఇసుక బంగారు రంగులో ఉంటుంది.

**షెల్ బీచ్, ఆస్ట్రేలియా:** ఆస్ట్రేలియాలోని షార్క్ బే వద్ద ఉన్న షెల్ బీచ్‌లో ఇసుక మరీ చిత్రం. ఆల్చిప్పల అతి చిన్న ముక్కలు అచ్చం ఇసుకలా అందులో కలిసిపోయి ఉంటాయి. అందుకే దీన్ని షెల్ బీచ్ అంటుంటారు.

**పపకోలియా బీచ్, హవాయి:** అమెరికాలోని హవాయి తీరంలోని పపకోలియా బీచ్‌లో ఇసుక లేత




ఆకుపచ్చ రంగులో ఉంటుంది.

**కావెండిష్ బీచ్, కెనడా:** కెనడాలోని ప్రిన్స్ ఎడ్వర్డ్ దీవిలో ఉన్న ఈ బీచ్‌లో ఇనుప ఖనిజం అధికంగా ఉన్న రాళ్ల నుంచి ఇసుక ఏర్పడింది. అందుకే ఎరుపు రంగులో ఉంటుంది. దీన్ని రెడ్ బీచ్‌గా కూడా పిలుస్తారు.

**ఫేఫర్ బీచ్, యూఎస్ఏ:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఈ బీచ్‌లో ఇసుక పర్పుల్ రంగులో ఉంటుంది. ఇక్కడికి సమీపంలోని కొండల్లో ఉన్న మాంగనీస్ నిక్షేపాలకు సంబంధించిన రాళ్ల వల్ల ఈ రంగు ఏర్పడిందని అంటారు. ✦



# వివేకానంద కవితా వైభవం

జయసూర్య

**భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేగుచుక్క భారతాద్వైతమూర్తి విశ్వయోగి స్వామీజీ, మహనీయ కవిగా ఇంగ్లీష్, బెంగాలీ, హిందీ, సంస్కృత భాషలలో మహా కవిత్వాన్ని వెలయించారు.**

**ఆయా భాషలలో వారు రచించిన కవితల సంఖ్య రాశిలో అతి తక్కువ అయినా విశ్వమానవతా దృక్పథం, జాతీయ భావోత్తేజం, ఆధ్యాత్మిక చింతనలతో భారతీయ ఋషివాక్యం, ప్రతిధ్వనించింది.**

ఒక కాషాయాంబరధారి, ఆంగ్ల భాషా విశారదునిగా ఆంగ్లేయుల్నే ఉ(గ్రూతలూగించిన మహా దార్శనికునిగా మహా దార్శనిక వక్తగా, ఇంగ్లీషు భాషలో ఊహించి ఇంగ్లీషులో వెలయించిన అద్భుత కవితా సంపదను బట్టి భారతీయుడైన తొలి అగ్రగణ్య ఆంగ్ల కవిగా భావించవచ్చు. విశ్వజనీనమైన భారతీయ సంస్కృతికి, సంస్కృత భాష మూలకందయని, సంస్కృత గ్రంథ సాహిత్యాన్ని క్షుణ్ణంగా బాల్యంలోనే అధ్యయనం చేసి, ప్రపంచానికి ప్రాచీన, నవీన సాధుగుణ సమన్వయంతో విశ్వజనీన దర్శనాన్ని ప్రతిపాదించిన తత్త్వవేత్త వివేకానందుని జ్ఞానసంపద, ప్రపంచాన్ని విస్మయపరిచింది. నిరంతర సంస్కృత భాషా వ్యాసంగం చేయటమే కాక ఆ భాషలో అద్భుత కవితా సంపదను మనకు ప్రసాదించిన స్వామీజీ వంటి కవులను చేతి వేళ్ల మీద మాత్రమే లెక్కపెట్టవచ్చు. 1861లో వివేకానందుడు 26 సంవత్సరాల వయస్సులో రవీంద్ర, వివేకానందుల అద్భుత సన్నివేశ సమావేశంలో రవీంద్రుడు తన పాటకు స్వర రచన చేసి వివేకానందకు నేర్పి పాడించడం ఒక చారిత్రక సంఘటన.

ఆంగ్లంలో అత్యంత ప్రతిభావంతుడైన వివేకానంద, ఉపన్యాసాలు, లేఖావళి, కవితా ఖండికలు వెలుగులోకి వచ్చాయి. ఒరిజినల్ ఆంగ్ల కవితలు కొన్ని కాగా, సంస్కృత వాఙ్మయం నుండి ఎంపిక చేసుకొని అనువదించిన ఖండికలు కూడా ఉన్నాయి. ఆయన ఆంగ్ల కవితలన్నీ దాదాపు 1893–1902 మధ్య కాలంలో సృజించబడినవే. ఈ కవితలన్నీ ఇతివృత్త వైవిధ్యం కలిగి భవ్య కవితావేశంతో రాసినవే. దేశభక్తి, మానవతా దృక్పథం, విశ్వమానవ సౌభ్రాతృత్వం వివేకానందుని కవితలకు ప్రధాన ప్రాతిపదికలు. స్వామీజీ వచన రచనలు కూడా కవితా శైలి, మాధుర్యంతో తొణికిసలాడతాయి.

చికాగో నగరంలో ప్రపంచ సర్వ మత మహాసభ వేదికపై వివేకానందుని మహోపన్యాసం, ఆంగ్ల సారస్వత భవ్యకవితావేశానికి నాందిగా భావించవచ్చు. భారతీయ ఆంగ్ల కవులుగా చెప్పదగిన తొలి తరం కవులలో మైఖేల్ మధుసూదన్‌దత్, తోరుదత్, రవీంద్రనాథ్ టాగోర్, సరోజినీనాయుడు సుప్రసిద్ధులు.

1893–1902 దశాబ్ద కాలంలో అమెరికా, ఇంగ్లండ్, యూరప్ దేశాలలో విశ్వయోగిగా వివేకావాణి ఆంగ్ల భాషా వైదుష్యం ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. "ఓ అమెరికా సోదరీ సోదరులారా" అన్న మధుర, శాంత, విశ్వమానవ సౌభ్రాతృత్వ ప్రతిపాదకమైన భారతీయ ఋషి సందేశం ప్రపంచంలో ప్రతిధ్వనించింది.

వివేకానందుని దివ్య ప్రసంగాలు పాశ్చాత్య మేధావంతులను ఎందరినో శిష్యులుగా లేఖలు బోధనలతో కదిలించాయి. వివేకానందుని లేఖా సాహిత్యంలో కవిత్వం పరవళ్ల తొక్కింది. 1893 సెప్టెంబర్ 4న ప్రొ॥ జాన్‌హెన్రీ రైట్‌కు రాసిన తొలి లేఖ 'ఇన్ సెర్చ్ ఆఫ్ గాడ్', 1895–1900 మధ్య సంవత్సరాలలో మేరీ హేల్‌కు 'ది సాంగ్ ఆఫ్ ది ఫ్రీ', 'మిస్ అండర్‌స్టుడ్' న్యూయార్క్‌లో రాసిన 'మై ప్లే ఈజ్ డన్', 1895 మే 16న రచించిన 'నో ఒన్ టు బ్లేమ్', న్యూ టెస్టామెంట్‌లో లాస్ట్ సప్పర్ ఇతివృత్తంగా 'ది కప్', న్యూయార్క్‌లో 'ది సాంగ్ ఆఫ్ ది సన్యాసిన్', 1896 జనవరి 6న సిస్టర్ క్రిస్టైన్‌కు రాసిన 'టు ఎన్ ఎర్లీ వయొలెట్', 1897 జులై 9న అమెరికన్ మిత్రునికి 'ది లివింగ్ గాడ్', 1898 జూన్‌లో అల్మోరా నుంచి 'రిక్విస్కట్ ఇన్ పీస్', 'కాశ్మీర్ నుంచి..

(మిగతా 27వ పేజీలో..)

**1900 సెప్టెంబరు 22న బ్రిట్టనీలోని పెర్రోస్ గైరీ నుంచి సిస్టర్ నివేదితకు పంపిన 'ఎ బెనిడిక్షన్' కవితకు స్వేచ్ఛానువాదం.**

"మాతృ హృదయం, వీరస్థైర్యం
దక్షిణ పవన మాధుర్యం
పవిత్ర మనోహరం సర్వశక్తి స్వరూపం
ఆర్యపీఠంపై స్వేచ్ఛా ఉజ్జ్వలవంతం
యివన్నీ యింకా ఎన్నో అన్నీ నీవే
ఏ ప్రాచీన ఆత్మ యింతకుముందు స్వప్నించనివి యివి.
భారత భవిత, పుత్రునిగా అన్నింటా ఒకనిగా ఉండు"

శిష్యురాలికి కవితా పరమైన దివ్యాశీస్సులు కానుక అందించారు.



# జ్ఞానోదయం

**యామిజాల జగదీశ్**

అదొక దాబా ఇల్లు. ఆ ఇంట్లో ఓ పెద్దమనిషి ఉన్నారు. ఆయనకో ఖరీదైన, విలాసవంతమైన కారు ఉండేది. ఆయన విదేశీయుడు. ఎక్కడికి వెళ్లాలన్నా ఆయన ఆ కారులోనే వెళ్లొస్తుంటారు. ఆయన కాళ్లు నేల మీద పడేవి కాదు. ఆయన నడవటం అనేది బహు అరుదు.

అటువంటి మనిషి ఓ రోజు ఉన్నట్టుండి మరణించారు. ఆ తర్వాత ఆయన గురించి పొరుగూరిలో ఉన్న ఇద్దరు మాట్లాడుకున్నారు. వారిలో ఒకడు "ఆ పెద్దాయన ఉన్నారే.. ఆయన ఈ లోకాన్ని విడిచిపెట్టిపోయారు" అని.

అప్పుడు మరొకడు "ఎందులో వెళ్లారు? ఆయన కారులోనే కదా!" అని అడిగారు.

ఆ మాటకు మొదటి వ్యక్తికి నవ్వొచ్చింది. ఈ లోకాన్ని విడిచిపెట్టి పోతున్నప్పుడు దేనిని తీసుకుపోగలరు? అన్నింటినీ విడిచిపెట్టిపోవలసిందే. అందుకే ప్రకృతి అన్నింటినీ ఒకేలాగా ఈ లోకానికి పంపుతుంటుంది. అలాగే ఈ లోకాన్ని విడిచేటప్పుడు కూడా ఏదీ తీసుకోనివ్వదు.

ఈ విషయంలో పెద్దా చిన్నా అనే తేడా లేదు. అందరూ ఒక్కటే, సమానమే.

కానీ తేడాలన్నీ మనిషి కల్పించుకున్నదే. నేను పెద్దా నువ్వు పెద్దా... ఇలా ఏవేవో అనుకుంటాం. కానీ జ్ఞానమొచ్చి వాస్తవాలు తెలిసిన తర్వాత ఇటువంటి తేడాలన్నీ తెరమరుగవుతాయి.

అనగనగా ఓ రాజు ఉండేవాడు. ఆయనకు తాను రాజుననే భావన ఎప్పుడూ ఉంటూ ఉండేది. తాను గొప్పవాడినని అనుకునేవాడు. ఓరోజు రాజు, రాణి ఎక్కడికో పని మీద బయటకు వెళ్లారు.

రాజుగారి భవనంలో ఓ పనమ్మాయి ఉంది. ఆ అమ్మాయి పనేమిటంటే- రాజుగారి పందిరి మంచాన్ని ఎప్పుడూ సిద్ధంగా ఉంచడం. అది ఖరీదైన గొప్ప మంచం. ఆ మంచం మీద పరుపుని శుభ్రంగా ఉంచడం అనేది అంత సులభమైన పని కాదు. దానిని శుభ్రంగా ఉంచడానికి ప్రతిరోజూ కనీసం నాలుగు గంటలు పడుతుంది.

తొలుత ఆ మంచం మీద రాజుగారు చెప్పిన ఓ ఖరీదైన దుప్పటిని పరచాలి. దాని మీద ఓ మెత్తటి దుప్పటి పరచాలి. ఆ తర్వాత దాని మీద మరింత మెత్తటి పరుపు వేయాలి. దాని మీద గులాబీ పువ్వులు చల్లాలి.

ఇలా మొత్తం మీద ఏడు దొంతర్లు ఉండాలి. అప్పుడే రాజు దాని మీద పడుకుంటాడు. ఆ రోజు పని మీద బయటకు వెళ్లిన రాజు, రాణి ఇంకా రాలేదు.

వారు వచ్చేలోపు తానూ ఈ మంచం మీద ఓ అయిదు పది నిమిషాలు పడుకుని సుఖాన్ని అనుభవించాలను కుంది పనిపిల్ల. ఆ క్షణంలో పుట్టుకొచ్చిన ఆశను తీర్చుకోవడం కోసం ఆమె మంచాన పరచిన పక్క మీద వాలింది. కానీ పడుకోవడంతోనే ఆమెకు నిద్ర ముంచుకొచ్చింది. ఆదమరచి నిద్రపోయింది. అయిదు నిమిషాలకున్న ఆ యువతి ఏకంగా నాలుగు గంటలు పైగానే నిద్రపోయింది.

పని మీద వెళ్లిన రాజూ, రాణీ తిరిగొచ్చారు. మంచాన పడుకున్న పనిమనిషిని చూడడంతోనే రాజుకు బాగా కోపం వచ్చింది. చప్పట్లు చరిచి భటులను పిలిచాడు. ఇద్దరు భటులు రావడంతోనే రాజు "ఆ యువతిని ఓ స్తంభానికి కట్టి ఓ ఇరవై అయిదు కొరడాదెబ్బలు వేయమన్నాడు. రాజుగారి ఆజ్ఞ" అని ఆదేశించాడు.

భటులకు ఆ యువతి పైన లోలోపల జాలి వేసినా రాజుగారి మాటగా ఆమెను శిక్షించక తప్పదుగా. రాజు చెప్పినట్టే ఆ యువతిని ఓ స్తంభానికి కట్టి కొట్టారు.

అయితే ఆ యువతి ఏడవకుండా నవ్వుతోంది. అలాంటి ఇలాంటి నవ్వు కాదు.. పగలబడి నవ్వుతోంది.

దాంతో రాజుకు ఆశ్చర్యమేసింది. "అదేంటీ? కొరడా దెబ్బలకు కుయ్యో, మొర్రో అని ఏడవకుండా నవ్వుతున్నావేంటీ; నీకు నొప్పెట్టడం లేదా?" అని అడిగాడు రాజు.

అప్పుడు ఆ యువతి "రాజా! నేనిలా చెప్తున్నానని నన్ను మళ్లీ శిక్షించకూడదు. అప్పుడే నేను నా మనసులో మాట చెప్తాను" అంటే-

రాజు "సరే" అన్నాడు.

ఆ యువతి "ఏమీ లేదు రాజా! నేను నాలుగు గంటలు పడుకుంటేనే నాకు ఇరవై అయిదు కొరడా దెబ్బలు తగిలాయి. మరి జీవితాంతం ఈ మంచం పైన పడుకునే మీకు ఎన్ని కొరడాదెబ్బలు వేయాలో తలచుకుంటే నవ్వొచ్చింది" అని చెప్పింది.

ఈ మాటతో రాజుగారికి కోపం రాకపోగా ఆలోచనలో పడ్డాడు. ఆమెను విడిచిపెట్టడమే కాకుండా అతనికి జ్ఞానోదయమైంది.

కథ విన్న ఒక కుర్రాడు చెప్పాడు... తన ఇంట్లో అమ్మ లడ్డూలు తయారు చేసి ఓ డబ్బాలో పెట్టింది. ఉన్నట్టుండి అందులో పది లడ్డూలు తగ్గాయి. అది పట్టించుకోకుండా నేను ఒక లడ్డూ తీసుకుని తింటున్న సమయంలో మా అమ్మ వచ్చింది. నేను తింటున్న లడ్డూను చూసి-

"నేనివ్వకుండా నీ అంతటే నువ్వే డబ్బాలోంచి లడ్డూ తీసుకుని తినడం తప్పు కదా! అని ఆ ఒక్క లడ్డూకి పది గుంజీళ్లు తీయమంది".

ఆ కుర్రాడు ఓ పది గుంజీళ్లు తీసాక వాడి చెవిని మెలేస్తూ "డబ్బాలో తగ్గిన మిగిలిన పది లడ్డూలకూ లడ్డూకి పది చొప్పున మొత్తం వంద గుంజీళ్లు తీయాలి" అని చెప్పింది.

అప్పుడా కుర్రాడు "అమ్మా, ఆ వంద గుంజీళ్లు తీయవలసింది నేను కాదమ్మా.. నాన్న" అని చెప్పి అక్కడి నుంచి తుర్రుమన్నాడు.

# ఇల్లు పునర్నిర్మించినప్పుడు..

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
**డా॥ దంతూరి పండరినాథ్**
3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



**ఒక ఖాళీ స్థలంలో గృహ నిర్మాణం చేయటానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి గత వారం చెప్పుకున్నాం. అదే ఆ స్థలంలో ఒక పాత ఇల్లు ఉన్నప్పుడు దానిని తీసేసి కొత్త ఇల్లు కట్టవలసి వస్తే, అప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వేరేగా ఉంటాయి. పాత ఇల్లు మీదే అయినప్పుడు, అక్కడ ఆ ఇల్లు తీసేసి కొత్త ఇల్లు కడదామనుకున్నప్పుడు ఒక పద్ధతి. పాత ఇల్లు ఉన్నటువంటి స్థలాన్ని మీరు కొని, అప్పుడు ఆ ఇంటిని తీసేసి గృహ నిర్మాణం చేసుకోవటం రెండవ పద్ధతి.**

అయితే ఆ ఇంట్లో ఎంతో కాలంగా నివాసం ఉంటూ ఆ ఇల్లు పాత పడ్డందుకు, వేరే ఏ కారణాల చేతనైనా సరే ఆ ఇంటిని నిర్మూలించి అదే స్థలంలో కొత్త ఇంటిని కడదాం అనుకున్నప్పుడు, కొంచెం సాంద్రతతో కూడిన పద్ధతులు ఉంటాయి.

## 'మన' పాత ఇంటిని తీసేసి కొత్త ఇల్లు కట్టేటప్పుడు:

ఆ ఇంటిని ఎంతో కాలం కింద కట్టి మనకు అందజేసినటువంటి మన 'పితృ దేవతల' కు మొదట కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆ ఇంటిని నిర్మూలించి కొత్త ఇంటిని కట్టుకునేందుకు కూడా వారి అనుమతి కోసం ప్రార్థించాలి. ఎంతో కాలంగా మీ తరతరాలకి ఆశ్రయం ఇచ్చినటువంటి ఆ ఇంటికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆశ్రయమిచ్చి అందులో ఎన్నో కర్మఫలాలను అనుభవింప చేసినందుకు కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎందుకంటే కర్మఫలం ప్రకారం మనం అనుభవించవలసినవి ఏవైనా సరే, అవి ఒక 'త్రు ప్రాపర్ ఛానల్' ద్వారా వస్తాయి. ఆ 'ప్రాపర్ ఛానల్' మనకి ఆశ్రయం ఇచ్చిన ఇల్లు. లేదా మనం ఆశ్రయం పొందిన ఇల్లు. అటువంటి ఇంట్లో ఉండి మనం కర్మ ఫలాలను అనుభవించటానికి కావలసిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని, సామర్థ్యాన్ని ఇచ్చేది ఇల్లు. మనకు ఆ విధంగా సహాయపడినందుకు మనకు మన పూర్వీకులకు, ఆ పాత ఇంటికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఆ ఇంట్లో ఉంటూ ఎన్నోరకాల కష్టనష్టాలను అనుభవించి, తట్టుకొని, ప్రగతిని సాధింప చేసినందుకు కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఏ ఇల్లు ఎవరికీ చెడు చెయ్యదు. అది ముందు గుర్తుపెట్టుకోవాలి. కొంతమంది ఆస్తమానం 'ఈ ఇంట్లో ఉన్నప్పటి నుంచి బాగాలేదు' ఇలా చెప్తూ ఉంటారు. అలా ఎప్పుడూ ఎవరితో అనుకోకూడదు. చెప్పకూడదు. అదంతా కర్మఫలం కిందే చూసుకోవాలి తప్ప వాటిని ఇల్లు ఇచ్చేది కాదు. ఇల్లు వాటిని ఎదుర్కోవటానికి సామర్థ్యాన్ని ఇస్తుంది. మనం ఎలా కట్టుకున్నామో ఇల్లు అలాగే ఫలితం ఇస్తూ ఉంటుంది. అందుకే ఇంటిని మంచి ఫలితాలు ఇచ్చేదిగా వాస్తు ప్రకారం కట్టుకోవాలి. ఆ ఇంటిని తీసేసి నూతన గృహ నిర్మాణం చేసుకోవడానికి మనకి అవకాశాన్ని ఇచ్చినందుకు ఇంటికి కూడా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈ కులగొట్టే ప్రక్రియలో దోషాలు దొర్లినట్లయితే అందుకు క్షమించమని పాత ఇంటిని వేడుకోవాలి.

ఈ విధంగా కృతజ్ఞతలు చెప్పుకోకుండా గబా గబా ఇళ్ళను కూలగొట్టేసి నూతన గృహ నిర్మాణం చేయడం మంచిది కాదు. ఫలితాలు ఆశించినంతగా ఉండవు. పైగా చెడు ఫలితాలు కూడా కలగవచ్చు. పాత ఇంటిని



కూలగొట్టడానికి కూడా ఒక ప్రక్రియ ఉంటుంది. ఆ పాత ఇంటిని మంచి ముహూర్తం చూసుకొని మొదట ఆ పాత ఇంటికి, ఈశాన్యంలో బయట నుండి ఇంటి యజమాని 'కూష్మాండ బలి'ని సమర్పించాలి. తమచే సమర్పించబడిన బలిని స్వీకరించి శాంతించి, తమని అనుగ్రహించమని వేడుకోవాలి. ఇంటి బయట ఈశాన్యం వైపు నుండి ఇంటి యజమాని 'బంగారు కొమ్ము'తో తూర్పు ఈశాన్యము వైపు గోడను ఐదు సార్లు తాకించాలి. ఈ విధంగా 'శాస్త్రీయంగా కూలగొట్టే ప్రక్రియ' మొదలవుతుంది.

**(మిగతా వచ్చే వారం..)**

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ..........................................
పుట్టిన తేది : ............ఊరు: ......................
జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ..............
చిరునామా:..............................................

# ఏకాగ్రత లేకపోతే..

కస్తూరి మురళీకృష్ణ

(గత వారం తరువాయి..)

**స్థవిరుడు పిలుస్తున్నట్టు అయోగ్యుడికి తెలిసింది. ఎందుకు పిలుస్తున్నాడో కూడా తెలుసు. తాను తప్పు చేసినట్టు తెలుసు.**

**కానీ బింకంగా, ఏమీ తప్పు చేయనట్టు, ఏమీ ఎరగనట్టు స్థవిరుడి ముందుకు వెళ్లి నుంచున్నాడు.**

"భిక్షుకా, మనం భిక్షను అడిగేవారం. ఏది ఇస్తే దాన్ని స్వీకరించాలి తప్ప అది కావాలి, ఇది కావాలి అని అడిగి భోజనం స్వీకరించేందుకు మనం అతిథులం, ఆత్మీయులం కాదు. నువ్వు నాకు అస్వస్థత అని అబద్ధం చెప్పావు. నేను ఆరోగ్యంగానే ఉన్నాను. భిక్షువు అసత్యం ఆడరాదు. యాచన భిక్షువుకు కూడని పని. మరోసారి ఇలాంటి అనుచిత కార్యాలు చేయవద్దు" అన్నాడు మందలింపుగా.

ఈ మాటలతో స్థవిరుడిపై కోపం కలిగింది అయోగ్యుడయిన భిక్షువుకు.

తలచుకున్నకొద్దీ కోపం తీవ్రమైన క్రోధంగా పరిణమించింది. కసి చెలరేగింది.

స్థవిరుడు మరుసటి రోజు భిక్షాటనకు వెళ్లగానే ఓ దుడ్డుకర్ర తీసుకుని ఆ ఆశ్రమంలో విరగగొట్టగల వాటన్నిటినీ విరగగొట్టాడు.

అయినా కసి తీరలేదు.

పర్ణశాలకు నిప్పు అంటించాడు.

పర్ణశాల దగ్ధమవటం చూసి పారిపోయాడు.

ఎంత దూరం పోయినా అతడికి శాంతి లభించలేదు. తెలియని భయంతో, ఆందోళనతో అతడు కుంగి కృశించిపోయాడు.

తీవ్రమైన అనారోగ్యం పాలయ్యాడు. బతికి వుండగానే పిశాచంలాగా అయిపోయాడు. చివరికి ఒకరోజు మరణించాడు.

మరణించిన తరువాత 'అవీచీ నరకాన్ని' చేరాడు.

బౌద్ధంలో అన్ని రకాల్లోకి నీచమైన స్థానం అవీచీ నరకానిది. అత్యంత దుర్భరమైన నరకం. ఘోరమైన తప్పిదాలు చేసినవారు ఈ నరకాన్ని చేరతారు. ఇక్కడ భూతదయ, విశ్రాంతులు మొదలైనవి ఉండవు.

అలాంటి నరకానికి వెళ్లాడు అయోగ్యుడయిన భిక్షువు.

దాంతో అతని దుష్కార్యాలు అందరికీ తెలిసాయి.

భిక్షువులందరూ రాజగృహం నుండి శ్రావస్తికి వచ్చారు.

తమకు వీలయిన ప్రదేశాలలో పాత్రలు, చీవరాలు ఉంచారు.

శాస్త సన్నిధికి వచ్చారు. శాస్తకు ప్రణామాలు ఆచరించారు.

శాస్త వారిని కుశల ప్రశ్నలు వేశాడు. కుశల ప్రశ్నలయిన తరువాత అడిగాడు శాస్త.

"ఎక్కడి నుంచి వస్తున్నారు?"

"రాజగృహం నుంచి" సమాధానం ఇచ్చారు.



"రాజగృహంలో మీకు ఉపదేశం ఇచ్చే ఆచార్యులు ఎవరు?"

"మహాకాశ్యప స్థవిరులు"

"భిక్షువులారా? ఆయన కుశల సమాచారాలు తెలపండి"

"మహాకాశ్యప స్థవిరులు క్షేమంగానే ఉన్నారు. కానీ వారి శిష్యులలో ఒక అయోగ్యుడు మాత్రం క్రోధుడై, భిక్షాటన నుంచి స్థవిరుడు నగరానికి వెళ్లినప్పుడు ఆశ్రమానికి నిప్పు పెట్టాడు. ఆశ్రమాన్ని దగ్ధం చేసి పారిపోయాడు".

వారు చెప్పింది విన్న బుద్ధుడు శాంతంగా వారితో చెప్పాడు.

"భిక్షువులారా, అతడు ఇప్పుడే కాదు పూర్వం కూడా ఇలాగే చేశాడు".

అది విన్న భిక్షువులలో కుతూహలం కలిగింది.

"మాకు ఆ కథ వినిపించండి" అని వేడుకున్నారు.

వారి కోరికను మన్నించిన శాస్త వారికి పూర్వ గాథ చెప్పటం ప్రారంభించాడు.

.........

అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం.

ఆ సమయంలో బోధిసత్త్వుడు పిట్టగా పుట్టాడు, పెరిగాడు. వర్షాకాలంలో వర్షం నుంచి రక్షించుకునేందుకు ఒక గూడు నిర్మించుకున్నాడు.

ఒకరోజు ఆకాశం కుండపోతగా వర్షించసాగింది. హిమాలయ ప్రాంతం అవటంతో చలి విపరీతంగా ఉంది. చలికి తాళలేక గడగడ వణుకుతూ ఒక కోతి వచ్చి బోధిసత్త్వుడికి కాస్త దూరంలో కూర్చుంది.

కోతి బాధపడటం చూసి బోధిసత్త్వుడు జాలిపడ్డాడు. దానిని అడిగాడు.

"నీకు మనుషులలాగే తల ఉంది. కాళ్లు, చేతులున్నాయి. కానీ మనుషులలాగా నీకు ఇల్లు లేకపోవటానికి కారణం ఏమిటి?"

పిట్ట ప్రశ్న విని కోతి కిచకిచలాడింది.

"నిజమే. నాకు మనుషులలాగే తల ఉంది. కాళ్లు, చేతులున్నాయి. కానీ మనుషులలా ప్రజ్ఞ లేదు" సమాధానంగా అంది కోతి.

దాని మాటలు విని బోధిసత్త్వుడు "నీకు చంచలత్వం ఎక్కువ, నియంత్రణ లేదు. ఉచితానుచితాల విచక్షణ లేదు. నీ మనస్సు నిత్య చంచలం. ఏకాగ్రత లేదు. ఏకాగ్రత లేనివాడు ఎలాంటి వాడితోనైనా ఎలాగైనా వ్యవహరిస్తాడు. ఎదుటివాడి సుఖం చూడలేడు. వాడికి కీడు చేయాలనే చూస్తాడు. అందుకేనేమో చలి నుండి, వర్షం నుండి నిన్ను నువ్వు రక్షించుకునేందుకు ఇల్లు నిర్మించే ప్రజ్ఞ నీకు లేదు".


పిట్ట మాటలు కోతికి ఆగ్రహం కలిగించాయి.

పిట్ట సురక్షితంగా ఉండి, వర్షంలో తడిసి, చలికి వణుకుతున్న తనను హేళన చేస్తున్నట్టుగా భావించింది.

“నీ పని పడతాను” అని పిట్టను పట్టుకునేందుకు పిట్టపై దూకింది.

కోతి చర్యను ముందే పసికట్టిన పిట్ట దానికి అందకుండా ఎగిరి పారిపోయింది.

కోతికి క్రోధం తగ్గలేదు. పిట్టగూడు లాగి పారేసింది. ముక్కలు చేసింది. అంతా నాశనం చేసి వెళ్లిపోయింది.



శాస్త కథ చెప్పి, ముగింపుగా చెప్పాడు.

“ఆ కాలంలో కోతి, మీరు చేసిన కుటీరానికి వచ్చింది అయోగ్య భిక్షువు. పిట్టను నేనే” అన్నాడు.

.........

అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం.

ఆ కాలంలో భిక్షువుల అభ్యర్థన మేరకు బుద్ధుడు చెప్పిన గాథ ఇది.

.........

తైర్థికుడు జేతవనం దగ్గరలో నివసించేవాడు.

అతడు స్వయంగా వంట వండేవాడు.

వంటను ఒక స్థలంలో కాకుండా ఎక్కడ బడితే అక్కడ వండేవాడు.

పంచాగ్ని హోత్రం నిర్వహించేవాడు, తపస్సులు చేసేవాడు. కానీ అది వ్యర్థ తపస్సు.

ఎవరెంత చెప్పినా తన మార్గాన్ని వదిలేవాడు కాదు.

“అగ్నిహోత్రం నడుమ తపించటం, వ్యర్థంగా మంత్రాలు వల్లె వేయటం, తపస్సంటూ జీవితాన్ని వెచ్చించటం వల్ల లాభం లేదని, అవన్నీ వ్యర్థం అని ఎందరు చెప్పినా అతను వినేవాడు కాదు. అతడు ఉన్న ప్రాంతం, దేశం నలుమూలల నుంచి భిక్షువులు శాస్త దర్శనానికి జేతవనం వచ్చే దారిలో ఉంది.

శాస్త దర్శనం కోసం వచ్చే భిక్షువులు, శ్రమణులు అతడు చేస్తున్న పూజలు, తపస్సులు చూస్తుండేవారు.

చివరికి ఒకరోజు ఒక భిక్షువు ఉండబట్టలేక శాస్తను అడిగాడు.. “మేం రోజూ చూస్తుంటాం. దారిలో కనబడే శ్రమణ బ్రాహ్మణులు పలు రకాలు వ్రతాలు చేస్తూ కనిపిస్తారు. వాటికి అర్థం ఏమిటి? వాటి సారం ఏమిటి?

“వాటికి అర్థం లేదు. సారం లేదు” అన్నాడు శాస్త. “మాకు వాటి గోల అర్థం కావటం లేదు. వాటి గురించి మాకు చెప్పండి” అభ్యర్థించారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త చెప్పటం ఆరంభించాడు.

**(ఇంకా ఉంది..)**

**(23వ పేజీ తరువాయి..)**

## కవితా వైభవం

‘ది ఎవేకెన్డ్ ఇండియా’, 1898 జులై 4న అమెరికన్ డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్ డే గురించిన ‘ది ఫోర్త్ ఆఫ్ జులై’, 1900 సెప్టెంబరు 22న సిస్టర్ నివేదితకు రాసిన ‘ఎ బెనిడిక్షన్’, 1900లో ‘దొ బ్లెస్డ్ డ్రీమ్’, 1900 సెప్టెంబరు 22న అల్బర్టా స్టర్జ్‌స్‌కు ‘మెనీ హేపీ రిటర్న్స్’, జోస్ ఫైన్‌కు 1900 డిసెంబరులో ‘లైట్’ ఆంగ్ల కవితలు అవిగాక బెంగాలీ నుంచి ఆంగ్ల అనువాదాలు, హైమ్న్ టు శ్రీరామకృష్ణ, సాల్యుటేషన్ టు శ్రీరామకృష్ణ, ‘హూమ్ టు ఫియర్?’ 1898 జూన్‌లో కాశ్మీర్ పర్యటనలో ‘ఎ సాంగ్ ఆఫ్ సూరదాస్’ ఇలా ఎన్నో దర్శనమిస్తాయి.

స్వామీ వివేకానంద, భారతీయ ప్రాచీన ఆధ్యాత్మిక భావ సంపదను ఆంగ్ల కవితల ప్రక్రియ రూపేణా ప్రవాహ సదృశంగా పాశ్చాత్య ప్రపంచానికి మేలుకొలుపు అందించారు.

ఆ కంఠంలోని గంభీర భాషా మాధుర్యం కవితా హృదయం సమున్నత శిష్య సమూహాన్ని అలరించేది. హూమ్ టు ఫియర్? 1894 సెప్టెంబరు 25 లేఖ, ‘అంబా స్తోత్రమ్’, ‘శివ స్తోత్రమ్’ వంటి శ్లోకాలు, రామకృష్ణ స్తోత్రాలు 1898 నవంబరులో బేలూరులో అప్రయత్నంగా వెలువడి అనిర్వచనీయ ఆధ్యాత్మిక అనుభూతి, అభినివేశం అందిస్తున్నాయి. జగద్గురు శంకరాచార్య, కారుణ్యమూర్తి గౌతమబుద్ధుడు, స్వామీ వివేకానంద భారతీయ మహోన్నతతో ప్రపంచానికి విశ్వజనీనత సంతరింపచేసిన జాగృత దివ్య చైతన్యం భారతీయ ధర్మ రథ విజయ పతాకలు.

లోకమాన్య బాలగంగాధర తిలక్, విశ్వకవి రవీంద్రుడు, మహాయోగి రామతీర్థ, ఆధ్యాత్మిక విప్లవ యోగి అరబిందొలు మహర్షి.. ఇలా ఎందరో మహాపురుషులు స్వామీకి సమకాలికులు.

1863 జనవరి 12న జన్మించిన స్వామీజీ, 1902 జులై 4న మహాసమాధిలో అవతార సమాప్తి చేసారు. ఆయన భౌతికంగా నడయాడిన స్వల్ప కాలంలోనే మాతృదేశానికి 1500 సంవత్సరాలకు అనుసరణీయ ఉజ్వల భవితవ్యాన్ని ప్రసాదించారు. ‘కండెన్స్‌డ్ ఇండియా’లో తరతరాల చరిత్ర, సంస్కృతీ విలువలను సాక్షాత్కరింపచేసారు.


**రచనలకు ఆహ్వానం**

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. *sunmagvaartha@gmail.com*



# సమయస్ఫూర్తి

డా|| పులివర్తి కృష్ణమూర్తి

అక్బర్ చక్రవర్తి మంచి ప్రజాదరణ కలిగిన చక్రవర్తుల్లో ఒకరు. ఆయన ప్రతిరోజూకొలువు తీరినప్పుడు ఏదో ఒక విధంగా సభికులకు వింత ప్రశ్నలూ, సమస్యలూ ముందుంచేవారు.

ఒక రోజున అక్బర్ కొలువులో బీర్బల్‌తో ఇలా అన్నారు.

బీర్బల్ ఆయన కొలువులో వున్న అతి తెలివిగలిగిన పండితుడిగా ప్రతీతి. అక్బర్ ఇలా అడిగారు.

“బీర్బల్! మీకు బంగారం నాణెం కావాలా, న్యాయం కావాలా?” అనగానే-

బీర్బల్ ఆలోచించకుండా వెంటనే “బంగారు నాణెం” కావాలన్నారు.

ఆ మాట విని సభలోని వారంతా గొల్లున నవ్వారు. కొందరు ఆ సమాధానం విని నివ్వెరపోయారు. బీర్బల్ అంటే గిట్టనివారు మాత్రం ఎంతో ఆనందించారు. బీర్బల్ సమాధానం విన్న చక్రవర్తి “బీర్బల్, నా చెవులను నేనే నమ్మలేకపోతున్నాను. నీకు బంగారు నాణెం కావాలా?” అన్నాడు.

“అవును మహారాజా, నేను బంగారు నాణేన్నే కోరుకుంటున్నాను” అన్నాడు.

దాంతో అక్బర్‌కు కించిత్ కోపం కూడా వచ్చింది.

అది గమనించిన బీర్బల్ “అవును మహారాజా, నన్ను మన్నించండి. ఎవరైనా ఏమైనా కోరుకోమంటే వాళ్లు తమ దగ్గర లేనివే ఎంపిక చేసుకుంటారు. మీ చల్లని పాలనలో మాకు చక్కని న్యాయం దొరుకుతోంది. అందుకే నేను మీ నుండి బంగారు నాణేన్నే కోరుకున్నాను” అని వినయంగా చెప్పాడు.

ఈ సమాధానం వినగానే అక్బరులో ఆగ్రహం, అసహనం రెండూ పోయాయి. ఆనందమేసింది మహారాజుకి. వెంటనే పండిత సన్మానానికి కావాల్సినవన్నీ తెప్పించాడు. బీర్బల్‌ను ఘనంగా సన్మానించాడు. అంతేకాదు, వంద నాణేలను బహుమానంగా ఇచ్చి సత్కరించాడు.

సమయస్ఫూర్తితో ఎంతటి క్లిష్టమైన సమస్య కావచ్చు, దాన్ని కూడా చిరునవ్వు ఆనందంగా దేహాన్ని ఒక ఆలయంగా భావించి అనుభవించాలి. లౌక్యం ఎంతో అవసరం.

# తెలివితేటలు ఎవరి సొమ్ము?

లోకంలో చాలా మందికి తామే తెలివిగలవారమన్న అభిప్రాయం ఉంటుంది. కానీ ఒక్కోసారి అందుకు భిన్నంగా జరగవచ్చునన్న విషయం అనుభవపూర్వకంగానే తెల్సుకోగలుగుతారు. ఒక ఊళ్లో ఒక వ్యక్తి జనాలను మోసం చేసి వస్తువులను కాజేయడంలో, డబ్బు గడించడంలో నైపుణ్యం సంపాదించాడు. ఒక రోజున బాగా సంపాదించి, ఆనందంగా, ఆ మూటను చంకలో పెట్టుకుని, హుషారుగా పాటలు పాడుకుంటూ ఊరిబయట నిర్మానుష్యంగా వున్న రోడ్డులో పోతున్నాడు. ఈరోజు చాలా ఖరీదైన వస్తువులే దొరికాయి అనుకుంటూ వెళ్తున్న అతనికి ఒక పిల్లవాడు చెరువుగట్టున కూర్చుని పెద్దగా శోకాలు పెడుతూ కనిపించాడు. ఆ ఏడుపు విని ఈ వ్యక్తి అతని దగ్గరకు వెళ్లి “ఏం బాబూ, ఎందుకు అంతగా ఏడుస్తున్నావు? ఏమైంది?” అనడిగాడు. దాంతో వాడు ఇంకా పెద్దగా ఏడుస్తున్నాడు. బాబూ, ఏడుపు ఆపి ఏమి జరిగిందో చెప్పు.. అని అడగగానే “మా నాన్న పట్నం నుండి నాకు డైమండ్ నెక్లెస్ తెచ్చాడు. అది వేసుకుని సరదాగా స్నానానికి వచ్చాను. ఆ నెక్లెస్ నీళ్లల్లో పడిపోయింది. మా నాన్న నన్ను చంపేస్తాడు” అంటూ ఇంకా బిగ్గరగా గుండెలు బాదుకుంటూ రాగాలు తీస్తున్నాడు. డైమండ్ నెక్లెస్ అనగానే ఆ పెద్ద మనిషికి ఆశ పుట్టింది. ఎలాగైనా తాను ఆ నెక్లెస్‌ను సొంతం చేసుకోవాలి” నెక్లెస్‌ను అమ్ముకుంటే చాలా డబ్బు వస్తుంది అనుకున్నాడు.

“అబ్బీ, నీవేమీ భయపడకు, నేను నీళ్లలోకి దిగి దాన్ని తీస్తాను. నువ్వు మాత్రం ఇదిగో ఈ మూటను జాగ్రత్తగా చూస్తూ ఉండు” అని ఆ డబ్బుమూటను పిల్లాడికిచ్చి ఆత్రంగా దూకాడు. ఇంకేముంది.. ఆ కుర్రవాడు డబ్బు మూట తీసుకుని ఒక్కటే పరుగు పెట్టాడు వెనక్కి తిరిగి చూడకుండా. ఆ పక్కనే వున్న అడవిలోకి వెళ్లి కనిపించకుండా పోయాడు.

పెద్దమనిషి నెక్లెస్ కోసం వెతికి వెతికి వేసారి చివరకు పైకి వచ్చాడు. ఇదేదో మోసం అనుకుంటూ చూస్తే ఏముంది.. ఆ పిల్లవాడూ లేడు, తనిచ్చిన డబ్బుమూటా లేదు. అయ్యో, నేను ఎంత మోసపోయాను.. అనుకుంటూ ఇంటిదారి పట్టాడు విచారంగా. అత్యాశ అనర్థానికి చేటు అంటే ఇదే మరి..!






### ఊళ్లో లేను

అనిల్: "నానీ! నువ్వు గీత గీస్తే మీ ఆవిడ దాటదు అన్నావు. నిన్న ప్రదీప్‌తో సినిమాకి వెళ్లడం చూసాను".

నాని: "ఓ అదా! నేను రెండు రోజులు ఊళ్లో లేనులే".

అనిల్: ఆ....!?

### సరే అనిందిగా..

కిరణ్: "నువ్వు ఏం చెప్పినా మీ ఆవిడ వింటుంది అన్నావు. నిన్న బట్టలు ఉతకమని" చెప్తుంటే విన్నాను.

కౌశిక్: అప్పుడు నేను "రేపు ఉతుకుతాను డార్లింగ్ అంటే సరే అనిందిగా".

### ఆవిరి పట్టొచ్చుగా..

డాక్టర్: "లిఖితా! మీ ఒంట్లో కొలెస్ట్రాల్ చాలా ఉంది. శరీరం చెమట పట్టే విధంగా చేయండి".

లిఖిత: "అలాగే డాక్టర్. ఆవిరి పడితే సరిపోతుందిగా".

### మా ఆవిడా అంతే!

విజ్జి: "నానీ, నిన్ను నమ్ముకుని కట్టుబట్టలతో వచ్చేసాను".

నాని: "మా ఆవిడ కూడా అలాగే చెప్పింది".

### అడ్రస్

లెక్చరర్: "ఈరోజు మీకు లాస్ట్ క్లాస్. పరీక్ష పేపర్ ప్రెస్‌కి ఇచ్చేసారు. మీకు ఇంకా ఏమైనా సందేహాలుంటే అడగండి".

విద్యార్థి: "ఒకే ఒక్క డౌట్ టీచర్.. ఆ ప్రెస్ అడ్రస్ ఎక్కడో చెప్తారా?"

లెక్చరర్: ....!?!

### పక్కింటివాళ్లతో..

కమల: "ఏమండీ! ఇవాళ ఆదివారం కదా, సినిమాకి వెళ్దామా?"

నాగు: "ఫ్యామిలీతో వెళ్లే సినిమాలు లేవే!"

కమల: "అయితే పక్కింటి నానితో వెళ్తానండి".

### మొబైల్ లేదు

కాకి ఇంకో కాకితో...

"ఆ పొలంలో ఉన్నది దిష్టిబొమ్మేనా? లేక మనిషి బొమ్మనా?"

రెండో కాకి: "మనిషి కాదు దిష్టిబొమ్మే".

మొదటి కాకి: "అంత కరెక్టుగా ఎలా చెప్తున్నావు?"

రెండో కాకి: "మనిషి అయితే మొబైల్ చూస్తూ ఉంటాడు, అందువల్ల అది దిష్టిబొమ్మ".

### ఊళ్లో లేను

రజని: "ఏమండీ! మీ ఫ్రెండ్ అనిల్ వాళ్లావిడకి డైమండ్ రింగ్ కొన్నాడు".

భర్త: "నా వల్ల అయ్యేది చెప్పు".

రజని: "అయితే అనిల్ మొబైల్ నంబర్ చెప్పండి".

### చూసాను..

రజని: "డాక్టర్‌గారూ! మా వారి జబ్బువివరాలు అన్నీ చెప్పాను కదా, అయినా టార్చ్ వేసి మా వారి నోట్లో ఎందుకు చూసారు?"

డాక్టర్: "మరేమీ లేదమ్మా, మీ వారి నోట్లో నాలుక ఉందా? లేదా? అని చూసాను".

### మరి... నా సంగతో!

రవి: "నాన్నగారూ! మీ కోడలు నన్ను కొట్టింది. నేను ఆత్మహత్య చేసుకుంటాను"

తండ్రి: "పిచ్చిసన్నాసీ, అలా అనుకుంటే నేను బతికే ఉన్నానుగా! మరేమి నన్నేమి చేయమంటావు?

- ఈ.ఎస్.మాధవన్

## హాస్య కవిత

### చరవాణి

అమ్మా!! చరవాణీ
నువ్వే మా చెవులకు కీరవాణి
నువ్వే మా దేహాలకు జీవనాడీ
నువ్వుంటే చాలమ్మా
బువ్వంటూ లేకున్నా చాలు.. మా పొట్టలో
పెళ్లాం కన్నా నువ్వే మాకెక్కువ
పిల్లల కన్నా నీపైనే మా మక్కువ.
నువ్వుంటే చాలమ్మా
నీలో నెట్టుంటే చాలమ్మా
నట్టింట్లోనే జిందగీ
నీ గుప్పిట్లోనే దునియా.
మరో అవయవమై మాలో ఒదిగి
మరో పని చేయకుండా అదిమి
రాజ్యమేలుతున్న రాణీ... ఓ చరవాణీ.
బండి నడుపుతున్నా
తిండి తింటూ ఉన్నా
చేతిలో నువ్వుండి తీరాలే
బెడ్ రూంలో ఉన్నా
బాత్ రూంలో
ఉన్నా పక్కన
నువ్వుండి తీరాలి.
రాత్రైతే చాలు నీ
టచ్ లేనివాళ్లు
నిలకడగా ఉండరమ్మా
నీకు వేలవేల దండాలు.
నీ అవసరం ఉండాలి కానీ
దానికి అంతం ఉండాలి.
అనంతం అయ్యావే.
తలగడ లేకున్నా చాలు నిదుర పోతాం
తలపక్కన నువు లేకుంటే
ఊపిరి వదిలేస్తాం
అన్నీ నువ్వే మాకు
అయ్యావే పెద్ద మేకు
అమ్మా నాన్న అన్నా
అక్కా చెల్లి లేకున్నా
ఆల్ ఇన్ వన్ నువ్వే
మాకింకా
నువ్వే మాకు మెతుకు
నువ్వే మాకు బతుకు..
అమ్మా చరవాణీ..
మా చెవులకు
నువ్వే కీరవాణి.



- గిరి పట్ల

## వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు.
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

### మేషం

శుభ కార్యాలకు సంబంధించిన వ్యవహారాలు, ఆలోచనలు కలిసి వస్తాయి. ముహూర్తాలను కుదుర్చుకోగలుగుతారు. ఇరుగు-పొరుగువారితో సఖ్యతగా మెలగాలన్న ఆలోచనలు అంతంత మాత్రంగానే ఉంటాయి. కొంత మంది ప్రవర్తన మీకు ఏమాత్రం నచ్చదు. వాళ్ల వలన వీధిపాలివ్వటం సహించరాని అంశంగా పరిణమిస్తుంది. పూజలు, వ్రతాలు చేసుకోవాలని భావిస్తారు.

### వృషభం

మీ కోసం, మీ కుటుంబం కోసం కొన్ని కార్యక్రమాలను చేపట్టి, విజయం సాధిస్తారు. జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు పాటిస్తారు. వ్యాపారాన్ని విస్తరింపజేయాలన్న ఆలోచనలు కలుగుతాయి. సంగీతం, సాంస్కృతిక రంగాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. అందరితోనూ కలివిడిగా ఉండగలుగుతారు. వాళ్ల ద్వారా మీకు కావాల్సిన పనులు చేయించుకుంటారు.

### మిథునం

జీవిత భాగస్వామి సలహాలు, సూచనల మేరకు నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ప్రయోజనాలను ఆశించి స్నేహితుల ద్వారా రాయబారాలను నడుపుతారు. సేవక బృందంతో సతమతమవుతారు. సాంకేతిక లోపాల వలన మీకు రావాల్సిన ఉత్తరాలు, శుభవార్తలు ఆలస్యంగా చేతికి అందుతాయి. చేసిన పని పూర్తి కాక మళ్లీ ప్రయత్నాలు ప్రారంభిస్తారు.

### కర్కాటక

దూర ప్రాంతంలోని మీ వారు మీకు ఎంత సహకరించినా కొన్ని పనులు మాత్రం పూర్తి కావు. కోరుకున్న మనిషిని పెళ్లి చేసుకోవడానికి ఎన్నో రకాల అడ్డంకులు ఏర్పడతాయి. కార్యాలయంలో అప్రయత్నంగా కొన్ని కార్యక్రమాలు కలిసి వస్తాయి. ప్రయోజనాలు అందుకుంటారు. నూతన గృహానికి సంబంధించిన ఆలోచనలు ఫలిస్తాయి.

### సింహం

నూతన కోర్సులు చేపట్టి విజయం సాధిస్తారు. పోటీ పరీక్షల్లో స్వల్పమైన అప్రశ్రుతులు చోటు చేసుకుంటాయి. జీవితాశయాన్ని సాధించడం కోసం అందరికీ దూరంగా ఉండి లక్ష్యసాధనే ధ్యేయంగా భావిస్తారు. కుటుంబంలో మరొకరి ఆదాయం పెరగడం మానసిక సంతోషానికి, ధైర్యానికి కారణం అవుతుంది. శుభకార్యాల వల్ల ఖర్చులు అధికం అవుతాయి.

### కన్య

విందు, వినోద కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. కార్యాలయంలో నూతన సహోద్యోగులతో సఖ్యతగా మెలగుతారు. మీకు లభించని అండదండలు, ప్రోత్సాహం మీరు వారికి అందిస్తారు. కొంతమంది బాగుపడడం మీ మనసుకు ఎంతగానో నచ్చుతుంది. సంతాన సంబంధమైన సమస్యలతో సతమతమవుతారు. వారాంతంలో శుభవార్తలు వింటారు.

### తుల

నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మధ్యవర్తులతో కలిసి కొన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తారు. స్పెక్యులేషన్‌కి దూరంగా ఉంటారు. కోర్టు వ్యవహారాలు, తీర్పులు మీకు అనుకూలంగా మారుతాయి. ఎంత బాగున్నప్పటికీ మరింత కష్టపడాలి, అప్పుడే అన్ని విధాలుగా మనకు బాగుంటుంది, ఏ ముప్పు వాటిల్లదు అన్న భావనతో ముందుకు నడుస్తుంటారు.జీవిత భాగస్వామితో విభేదాలు ఏర్పడకుండా సంయమనం పాటిస్తారు.

### వృశ్చికం

ఏ ప్రయోజనం లేని వ్యక్తులను కూడా చేరదీస్తారు. వారికి అభయ హస్తం అందిస్తారు. వాళ్ల ద్వారానే ఇంట్లో కొన్ని గొడవలు ఏర్పడతాయి. కనుక వీళ్లని ఏదో ఒక మంచి మార్గంలో ఉంచాలన్న సంకల్పించుకుంటారు. మంచి విద్యాబుద్ధులు అబ్బే విధంగా వీళ్లని హాస్టళ్లలో ఉంచాలన్న ఆలోచనలు కలిసి వస్తాయి. క్రియేటివిటీ రంగంలో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. క్రీడల్లో మంచి విజయాలు నమోదు చేసుకుంటారు.

### ధనుస్సు

ఇంట్లోనూ, వ్యాపార ప్రదేశాల్లోనూ స్వల్ప చికాకులు, మనస్పర్థలు ఏర్పడవచ్చు. మీ వైపు నుండి ఏమాత్రం తప్పులు దొర్లకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తారు. తల్లి తరపు బంధువులతో సాధ్యమైనంతవరకు మాట పట్టింపులకు పోకుండా వాళ్ల కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తుంటారు. స్నేహితుల ద్వారా నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు చేయాల్సి వస్తుంది.

### మకరం

వ్యాపారాలను మొదలు పెట్టాలన్న కఠినమైన నిర్ణయాలు, మంచి సంకల్పం చేసుకోగలుగుతారు. ఆస్తులకు సంబంధి అయినవాళ్లతో పోరాటం చేయాలన్న ఉద్దేశంగానీ మనస్తత్వంగానీ ఉండదు. ఈ నేపథ్యంలో కొన్ని కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యే విధంగా పరిస్థితులు గోచరిస్తున్నాయి. నూతన వాహనాన్ని కొనుగోలు చేయాలని ఆలోచనలు ముడిపడతాయి. పాత వాహనాన్ని తెలిసిన స్నేహితులకు అమ్మాలని నిర్ణయించుకుంటారు.


### కుంభం


నూతన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. స్వర్ణాభరణాలు మార్పిడి, తాకట్టు ఇచ్చే విధంగా పరిస్థితులు ఏర్పడతాయి. కార్యాలయంలో నూతన అధికారులతో సఖ్యత కలిగి ఉంటారు. వాళ్లకు కావాల్సిన పనులు మీరు సకాలంలో చేయడం, వారి అండదండలు అందుకునే విధంగా మీ ప్రవర్తన ఉంటుంది. స్వశక్తి మీద ఆధారపడి ఉన్న వ్యక్తులకు ఈ వారం అనుకూలమైన ప్రభావాలు, అవకాశాలు లభిస్తాయి.

### మీనం

రహస్యంగా ఒక స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. రహస్య సమాచారం ద్వారా ప్రయోజనాలు దక్కించుకుంటారు. కార్యాలయంలో పురుడు పోసుకుంటున్న కుట్రలు, కుతంత్రాలను ఎండగడతారు. ఎవరి దారి వారిది, ఎవరి పనులు వాళ్ల చేసుకోవాలి. ఎవరి శక్తి సామర్థ్యాలు వాళ్లు నిరూపించుకోవాలి అన్న విధంగా మీ అభిప్రాయాలు ఉంటాయి. నూతన వస్తువులు, వస్త్రాలు, విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

# ఈ వారం కా‘ర్టూన్స్’


మా బొకతురిది అనుకుంటా...
ఢిల్లీ నుండి వస్తున్నాడు..!!


.... సర్వే చేయడానికొచ్చాడు.. ఈ ఊర్లో తన సామాజిక వర్గానికి చెందిన వాళ్ళు అసలే లేరట... చాలా ఎమోషనల్ అయిపోతున్నాడు....!!


.. చలిగా ఉందా? ఇంకా క్రికెట్టుకు ఇండోర్, ఏసీ
స్టేడియంలు రాలేదు నాయనా.. ఇక్కడే ఆడాలి..!!







చిట్టడవిని
తలపించే ఈ మహా వృక్షం
బ్రెజిల్‌లో ఉంది. ప్రపంచంలోనే అతి
పెద్దదిగా పేరు గాంచిన ఈ జీడి చెట్టును
సందర్శించడానికి యేటా లక్షల మంది
వస్తుంటారట. రెండు ఎకరాల్లో
విస్తరించిన ఈ వృక్షం సుమారు
వెయ్యి సంవత్సరాల నాటిదని
చెప్తుంటారు.









